అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

14.07.2026
మంగళవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 63
పేజీలు : 12 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.



## మన పూర్వీకులంతా సనాతన హిందూ ఆర్యవైదికులే

- యోగా గురు బాబా రాందేవ్
- 'హిందూ రాష్ట్రం' వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- దేశం రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటోంది
- అన్ని మతాలకు సమాన గౌరవం ఇచ్చే సూత్రం

2లో..



### పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన
## సీఎం దేవేంద్ర ఫడణవీస్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. అనంతరం ముంబైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆస్పత్రికి వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రికి వచ్చి పరామర్శించినందుకు దేవేంద్ర ఫడణవీస్‌కు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ సందర్భంగా ఇద్దరు నాయకులు కాసేపు ఆత్మీయంగా పలు కీలక విషయాలపై మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది.

## భారత్‌కు 15 మంది భారతీయుల మృతదేహాలు..!

### వియత్నాం బోటు బోల్తా ఘటన
### మృతులకు కేంద్రం సానుభూతి

2లో..

**న్యూఢిల్లీ, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

వియత్నాంలో శనివారం జరిగిన ఘోర బోటు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 15 మంది భారతీయుల మృతదేహాలు సోమవారం స్వదేశానికి చేరుకోనున్నాయి. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్‌కు చెందిన VN979 విమానంలో మృతదేహాలను భారత్‌కు తరలిస్తున్నట్లు హనోయ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 9:35 గంటలకు ఈ విమానం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది.

### బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ
## గోదావరి పుష్కరాలకు ముందే ..

- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా..
- 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం
- బ్యారేజీని గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం చేసింది
- కాటన్ బ్యారేజీ గేట్లను మార్చలేదు
- కొట్టుకుపోయినా పట్టించుకోలేదని ఆగ్రహం
- పోలవరం ప్రాజెక్ట్‌లో 72 శాతం పనులను పూర్తి

2లో..



**అమరావతి, జులై 13,అనంత జనశక్తి న్యూస్**

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల నిర్మాణ పనులను సీఎం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బ్యారేజీని గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాటన్ బ్యారేజీ గేట్లను మార్చలేదని.. కొట్టుకుపోయినా పట్టించుకోలేదంటూ వైసీపీపై మండిపడ్డారు. గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్లను పునరుద్ధరణ చేస్తామని స్పష్టం చేశారు.
పోలవరం ప్రాజెక్ట్‌లో 72 శాతం పనులను పూర్తి చేశామని.. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని సీఎం తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయన్నారు. పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని.. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేశామని చెప్పుకొచ్చారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో డబ్బులు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అభిమానులు ఎక్కువని అన్నారు. పవన్ భుజానికి శస్త్ర చికిత్స జరిగిందని.. ముంబై వెళ్లి ఆయనను పరామర్శించినట్లు తెలిపారు. ఆరోగ్యం కుదుటపడ్డాకే విధుల్లోకి రావాలని పవన్‌కు చెప్పానని సీఎం పేర్కొన్నారు.

**పనులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను ప్రారంభించి.. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందనే దానిపై చంద్రబాబు ఆరా తీయగా.. 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని అడుగగా.. 14,700 క్యూసెక్కుల నీటిని కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. చివరి భూములకు నీరందేలా చూసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

## ఆ సమయం ఇక వచ్చేసింది

### విద్యా వ్యవస్థలో దోపిడీనిఅరికట్టాల్సిందే
### లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్



2లో..

**న్యూఢిల్లీ, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

భారత్‌లో విద్యా వ్యవస్థ మోసపూరితంగా మారిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్య పేరిట జరుగుతోన్న దోపిడీని నిలువరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

## 2 వారాల్లో నిబంధనలు సమర్పించండి

- విమాన ఛార్జీలపై సుప్రీంకోర్టు
- సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణన్ పిటిషన్

2లో..



### భోగాపురం విమానాశ్రయానికి
## ఇమ్మిగ్రేషన్ హోదా

ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ 11లో..
ఇక నేరుగా విదేశీ ప్రయాణాలు...!
త్వరలోనే ఇక్కడి నుంచి అంతర్జాతీయ సర్వీసులు

**అమరావతి జులై 13, అనంత జనశక్తి న్యూస్**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం అధికారిక ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా గుర్తింపునిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అధీకృత ఇమ్మిగ్రేషన్ కేంద్రాల జాబితాను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

## ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు

- ఓపీఎస్ ఎంపికకు వన్‌టైమ్ ఛాన్స్
- 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు..
- ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి
- ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులు



2లో..

**అమరావతి, జులై 13, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు.

## అప్పలరాజు కొడుకు సరెండర్

- గొర్రెల కాపరి కేసులో కీలక పరిణామం
- పోలీసుల ఎదుట లొంగుబాటు
- బైక్ నడిపింది ఆరవ్ అని నిర్ధారణ

11లో..

## ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్స్ చేస్తే కఠిన చర్యలు

### సోషల్ మీడియాలో హద్దులో దాటొద్దు
### హోం మంత్రి అనిత వార్నింగ్

2లో..

**అమరావతి జులై 13, అనంత జనశక్తి న్యూస్**

సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లుగా పోస్టింగ్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అనకాపల్లి జిల్లాలో సైబర్, సోషల్ మీడియా కేసులు పెరిగాయని పేర్కొన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను హోం మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు.



### తిరుపతిలో తెలుగు
## తమ్ముళ్ల కొట్లాట

- మంత్రుల ముందే రక్తం కారేలా కొట్లాట
- పుంగనూరు నియోజకవర్గ టీడీపీలో విభేదాలు
- ఇంఛార్జి ఎంపికపై వివాదం రెండు వర్గాలు పరస్పరం దాడులు

2లో..

**తిరుపతి, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

తిరుపతిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. తోపులాటలు, పిడిగుద్దులతో రక్తం వచ్చేలా గొడవపడ్డారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం అడుగులు వేస్తోంది. 2024 ఎన్నికల్లో వైసీపీ గెలిచిన 11 స్థానాల్లోనూ టీడీపీ జెండా పాతేలా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే ఓడిపోయిన స్థానాలలో నాయకత్వ మార్పు దిశగా అడుగులు వేస్తోంది.

# ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు



**అమరావతి, జులై 13, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఈ ఉత్తర్వుల ప్రకారం, జీవో జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపీఎస్ లేదా సీపీఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పరిధిలోనే కొనసాగుతారని జీవోలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

# మన పూర్వీకులంతా సనాతన హిందూ ఆర్యవైదికులే

**న్యూఢిల్లీ, జులై 13, అనంతజనశక్తి న్యూస్**



ప్రముఖ యోగా గురుబాబా రాందేవ్ చేసిన 'హిందూ రాష్ట్రం' వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. 'హిందూ రాష్ట్రం' భావన గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, దేశంలో ముస్లింలు, క్రైస్తవులకు ఎలాంటి ముప్పులేదని, మనందరి పూర్వీకులు ఒక్కరేనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, మత పెద్దల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. ఇటీవల బాబా రాందేవ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. హరిద్వార్ సమీపంలోని ప్రముఖ ఇస్లామిక్ విద్యా సంస్థ దేవ్‌బంద్‌ను 2009లో తాను సందర్శించిన విషయాన్నిగుర్తుచేసుకున్నారు. ''హరిద్వార్‌కు సమీపంలో దేవబంద్ ఉంది.. వారు నన్ను 2009లో ఆహ్వానించారు.. అప్పుడు నేను వారితో మన మతాలు వేరు కావచ్చు, కానీ మనరి పూర్వీకులంతా ఒక్కరే.. సనాతన హిందూ ఆర్యవైదికులే.. ఈ విషయం ముందు స్పష్టంగా లిఖితమై ఉంది.. అందుకే హిందూ రాష్ట్రం అనే భావన పట్ల ఎవరూ భయపడాల్సిన పనిలేదు... ముస్లింలు, క్రైస్తవులకు ఎలాంటి ముప్పు ఉండదు అని చెప్పాను''యోగా గురు రాందేవ్ వ్యాఖ్యానించారు. ''హిందూ రాష్ట్రం ఏర్పడితే ముస్లింలు ఎక్కడకు వెళ్తారు అని కొందరు అడుగుతుంటారు? వారికి సమాధానం ఒక్కటే మీ మత విశ్వాసాలను అనుసరిస్తూనే.. పూర్వీకుల సంప్రదాయాలను గౌరవించమని చెబుతాను.. మీరు గడ్డం ఉంచుకోవచ్చు లేదా తీసేయవచ్చు.. మీకు నచ్చిన బట్టలు వేసుకోవచ్చు.. కానీ, మీ ప్రవర్తన మాత్రం మీ పూర్వీకులలాగే ఉంచుకోండి.. హిందూస్థానలో ముస్లింలు, క్రైస్తవుల ఉనికి ఎటువంటి ముప్పు లేదు'' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. అందరి పూర్వీకులు ఒక్కరే అయితే.. సమాజంలో ఎందుకు విభజన సృష్టిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ప్రశ్నించారు. ''ఆందోళన చెందాల్సిన అవసరం లేదు కానీ ఆ విషయం గురించి హిందూ రాష్ట్రం గురించి మాట్లాడిన బాబా రామ్‌దేవ్‌ను .. వారి మనస్సులో ఏముందో, ఏ సందర్భంలో వారు ఇలా అంటున్నారో నేను ఎలా చెప్పగలను? అందరూ సనాతనులే అయితే, ఇక్కడ ఇన్ని విభజన గోడలు సృష్టించడానికి ఎందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి? అందరినీ సనాతనులుగా అంగీకరించండి మరి విభేదాలు ఎందుకు సృష్టిస్తున్నారు?'' అని కాంగ్రెస్ నేత నిలదీశారు. అలాగే, మజ్లిస్ పార్టీ అధికార ప్రతినిధి వారిస్ పఠాన్ స్పందిస్తూ.. రాజ్యాంగం ప్రకారం దేశం నడుస్తోందని, భారత్ దేశాన్ని లౌకిక రాజ్యంగా అభివర్ణించిందని, దానిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని పఠాన్ హితవు పలికారు. ''ఈ దేశం రాజ్యాంగం ప్రకారం నడుస్తోంది.. మున్ముందు కూడా అలాగే ఉంటుంది.. 'హిందూ రాష్ట్రం'గా మారిందని మీకు ఎవరు చెప్పారు? భారత్‌ను హిందూ దేశంగా ప్రకటించారా? అని నేను ప్రధాని మోదీని అడగాలనుకుంటున్నాను. ముస్లింలు ఎవరికీ భయపడరు. మేము చట్టాన్ని గౌరవిస్తాం.. రాజ్యాంగబద్ధంగానే మా అభిప్రాయాలను వ్యక్తం చేస్తాం..... అసలు ఏం మాట్లాడుతున్నారో మీకు అర్థమవుతోందా? రాజ్యాంగాన్ని గౌరవించి, దాని పరిధిలోనే మాట్లాడండి. ఇలా ద్వేషాన్ని వ్యాప్తి చేయడం ఆపండి'' అని ఏఐఎంఐఎం ప్రతినిధి అన్నారు. యోగా గురువు బాబా రాందేవ్ ప్రకటన దేశంలోని 'అతి ముఖ్యమైన సవాళ్ల' నుంచి ప్రజల దృష్టిని మళ్లించే వ్యూహంలో భాగమేనని సమాజ్ వాదీ పార్టీ నేత ఫక్రుల్ హసన్ చాంద్ విమర్శించారు. బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే ఉద్దేశపూర్వకంగా బీజేపీ ఇలాంటి కథనాలను ముందుకు తెస్తోందని ఆయన ఆరోపించారు. మరోవైపు, పలువురు ముస్లిం మత పెద్దలు కూడా రాందేవ్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. 'అన్ని మతాలకు సమాన గౌరవం' అనే సూత్రంపై భారత్ ఏర్పడిందని నొక్కిచెబుతూ, రాందేవ్ ప్రకటనను ఎన్సీపీ ఖండించింది. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా, సమాజాన్ని విభజించేలా మాట్లాడటం ఎంతమాత్రం సమంజసం కాదని పలువురు పెద పెద్దలు అభిప్రాయపడ్డారు.

# ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్స్ చేస్తే కఠిన చర్యలు



**అమరావతి జులై 13, అనంత జనశక్తి న్యూస్**

సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లుగా పోస్టింగ్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అనకాపల్లి జిల్లాలో సైబర్, సోషల్ మీడియా కేసులు పెరిగాయని పేర్కొన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను హోం మంత్రి స్వీకరించారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ మంచి ఫలితాలను ఇస్తోందని హోం మంత్రి అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. జిల్లాలో ఈ ఏడాది క్రైమ్ రేట్ 15 శాతం తగ్గిందని వెల్లడించారు. జిల్లాలో మహిళలపై చేసే దాడుల్లో క్రైమ్ రేటు 7 శాతం తగ్గిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# ఆ సమయం ఇక వచ్చేసింది



**న్యూఢిల్లీ, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

భారత్‌లో విద్యా వ్యవస్థ మోసపూరితంగా మారిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్య పేరిట జరుగుతోన్న దోపిడీని నిలువరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విద్యా వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నప్పటికీ.. ఆ ఇద్దరూ మౌనం వహించారని, జవాబుదారీతనం నుంచి తప్పుకొన్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు.

''అవినీతి, అన్యాయం, పక్షపాత వైఖరి, నిజాయితీ లోపించడం... ఈ నాలుగు పదాలు నేను చెప్తున్నవి కాదు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు విద్యా వ్యవస్థను ఉద్దేశించి వాడుతున్న పదాలు. భారత విద్యా వ్యవస్థ ఇప్పుడు మోసపూరితమైన, దోపిడీ యంత్రాంగంగా మారిపోయింది'' అని రాహుల్ గాంధీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థ.. కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలోని అవినీతి వల్లే పేపర్ లీకేజీ మాఫియా పురుడు పోసుకుందని, లక్షల మంది విద్యార్థులు ఏళ్లపాటు పడుతున్న కష్టాన్ని ఒక్క దెబ్బతో దోచేస్తోందని అన్నారు. తప్పు చేసిన సంస్థలకు టెండర్లు, అధికారులకు ప్రమోషన్లు వస్తున్నాయి గానీ, శిక్ష మాత్రం.. తమ కలలను సాధించుకోలేక, ఒంటరిగా మిగిలిపోతున్న విద్యార్థులకు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఇవన్నీ తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. జరిగిందేదో జరిగిపోయిందని, ఇప్పుడైనా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు తనతోపాటు అడుగేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. దేశ విద్యా వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి విద్యార్థుల స్వరాన్ని ప్రభుత్వానికి చేరవేసే లక్ష్యంతో రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. తొలివిడతగా జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండో విడతగా దేహ్రాదూన్‌లో జులై 17న ఈ కార్యక్రమం జరగనుంది.

# భారత్‌కు 15 మంది భారతీయుల మృతదేహాలు.!




**న్యూఢిల్లీ, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

వియత్నాంలో శనివారం జరిగిన ఘోర బోటు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 15 మంది భారతీయుల మృతదేహాలు సోమవారం స్వదేశానికి చేరుకోనున్నాయి. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్‌కు చెందిన VN979 విమానంలో మృతదేహాలను భారత్‌కు తరలిస్తున్నట్లు హనోయ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 9:35 గంటలకు ఈ విమానం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనుంది. అనంతరం మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తున్నట్లు భారత రాయబార కార్యాలయం తెలిపింది.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన భారత రాయబార కార్యాలయం.. వారికి అవసరమైన అన్ని సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. బాధిత కుటుంబాలతో సమన్వయం కొనసాగించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కోరినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో 10 మంది తమిళనాడుకు చెందినవారు, ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు, ఇద్దరు కేరళకు చెందినవారని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు పర్యాటకులు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నారు. వియత్నాం మీడియా కథనాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఫు క్వాక్ ద్వీపకల్పం సమీపంలో ఈ విషాదం చోటుచేసుకుంది. 'ఓషన్ పెర్ల్ ఐలాండ్' సంస్థకు చెందిన స్పీడ్‌బోట్ 36 మంది ప్రయాణికులతో 'హాన్ మే రట్' దీవి నుంచి 'అన్ థోయ్' రేవుకు వెళ్తుండగా సముద్రంలో ఒక్కసారిగా మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో 15 మంది భారతీయులు మృతి చెందగా.. పలువురు గాయాలతో బయటపడ్డారు.

# తిరుపతిలో తెలుగు తమ్ముళ్ల కొట్లాట



**తిరుపతి, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

తిరుపతిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. తోపులాటలు, పిడిగుద్దులతో రక్తం వచ్చేలా గొడవపడ్డారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం అడుగులు వేస్తోంది. 2024 ఎన్నికల్లో వైసీపీ గెలిచిన 11 స్థానాల్లోనూ టీడీపీ జెండా పాతేలా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే ఓడిపోయిన స్థానాలలో నాయకత్వ మార్పు దిశగా అడుగులు వేస్తోంది. ఇక వైసీపీ గెలిచిన 11 స్థానాలలో రెండు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెందినవే కావడం విశేషం. ఎన్డీఏ కూటమి వేవ్‌లోనూ పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు టీడీపీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే నియోజకవర్గ నాయకత్వ మార్పు అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఇందుకోసం కార్యకర్తల నుంచి అభిప్రాయాలు తెలుసుకునే పనిలో టీడీపీ అధిష్టానం ఉంది. ఆ క్రమంలోనే తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జిల ఎంపికపై తిరుపతిలోని గ్రాండ్ బ్రిడ్జ్ హోటల్ వేదికగా కార్యకర్తలతో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భేటీ అయ్యారు. కార్యకర్తల అభిప్రాయ సేకరణ కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. సోమవారం ఉదయం తంబళ్లపల్లె నియోజకవర్గం ఇంఛార్జి ఎంపికపై అభిప్రాయ సేకరణ జరిగింది. తంబళ్లపల్లె ఇంఛార్జిగా ఉన్న జయచంద్రారెడ్డిని టీడీపీ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. మద్యం కుంభకోణంలో ఆరోపణలు రావడంతో జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో శంకర్ యాదవ్‌ను తంబళ్లపల్లె టీడీపీ ఇంఛార్జిగా నియమించాలని టీడీపీలోని ఓ వర్గం కోరుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి తక్కువ మందిని మాత్రమే అనుమతించారని జయచంద్రారెడ్డి ఆరోపిస్తున్నారు. ఆయన పిలుపుతో జయచంద్రారెడ్డి మద్దతుదారులు భారీగా హోటల్‌కు తరలివచ్చారు.

ఇక మధ్యాహ్నం సమయంలో పుంగనూరు నియోజకవర్గ ఇంఛార్జి ఎంపికపై నేతలు అభిప్రాయాలు తెలుసుకున్నారు. పుంగనూరు నియోజకవర్గ నాయకత్వంలో మార్పు చేయాలని ఓ వర్గం పట్టుబడుతుండగా.. ప్రస్తుతం ఇంఛార్జిగా ఉన్న చల్లాబాబును కొనసాగించాలని మరోవర్గం పట్టుబట్టింది. ఈ క్రమంలోనే రెండు వర్గాల మధ్యన వాగ్వాదం మొదలైంది. ఈ వాగ్వాదం కాస్తా తోపులాటలు, పిడిగుద్దుల వరకూ దారితీసింది. ఈ ఘటనలో కొంతమంది కార్యకర్తలకు రక్త గాయాలయ్యాయి. అయితే మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోనే ఈ బాహాబాహీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు వర్గాలకు సర్దిచెప్పలేక మంత్రులు తలలు పట్టుకున్నారు.

# 2 వారాల్లో నిబంధనలు సమర్పించండి

**న్యూఢిల్లీ, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

విమానయాన సంస్థల టికెట్ ఛార్జీల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. భారతీయ వాయుయాన్ అధినియం, 2024 చట్టం కింద రూపొందించిన నిబంధనలు సమర్పించాలని సూచించింది. సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు వెలువరించింది.ప్రైవేటు విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా దోచుకుంటున్నాయని, ఛార్జీల విషయంలో పారదర్శకత పాటించడం లేదంటూ లక్ష్మీనారాయణన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా పండగల సమయంలో ఈ దోపిడీ అధికంగా ఉంటోందని అతని తరఫు న్యాయవాది రవీంద్ర శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. డిమాండ్‌ను బట్టి విమానయాన సంస్థలు ధరలను పెంచకుండా నిరోధించే నిబంధన ఏదీ ప్రస్తుతం లేదన్నారు. దీనిపై స్వతంత్రమైన, పటిష్ఠ నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని న్యాయస్థానం పరిశీలించాలని కోరారు.అయితే, కొత్త చట్టానికి సంబంధించి ముసాయిదా నిబంధనలు రూపొందుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. వాటిని పార్లమెంట్‌కు సమర్పించాల్సి ఉందన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. రెండు వారాలు గడువు ఇస్తున్నామని, సీల్డ్ కవర్‌లో నిబంధనావళిని సమర్పించాలని కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేసింది.

# బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ గోదావరి పుష్కరాలకు ముందే

**అమరావతి, జులై 13,అనంత జనశక్తి న్యూస్**



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల నిర్మాణ పనులను సీఎం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బ్యారేజీని గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాటన్ బ్యారేజీ గేట్లను మార్చలేదని.. కొట్టుకుపోయినా పట్టించుకోలేదంటూ వైసీపీపై మండిపడ్డారు. గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్లను పునరుద్ధరణ చేస్తామని స్పష్టం చేశారు.

పోలవరం ప్రాజెక్ట్‌లో 72 శాతం పనులను పూర్తి చేశామని.. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని సీఎం తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయన్నారు. పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని.. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేశామని చెప్పుకొచ్చారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో డబ్బులు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అభిమానులు ఎక్కువని అన్నారు. పవన్ భుజానికి శస్త్ర చికిత్స జరిగిందని.. ముంబై వెళ్లి ఆయనను పరామర్శించినట్లు తెలిపారు. ఆరోగ్యం కుదుటపడ్డాకే విధుల్లోకి రావాలని పవన్‌కు చెప్పానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**పనులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను ప్రారంభించి.. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందనే దానిపై చంద్రబాబు ఆరా తీయగా.. 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని అడుగగా.. 14,700 క్యూసెక్కుల నీటిని కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. చివరి భూములకు నీరందేలా చూసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గోదావరి, కోనసీమ అందాల సీమ అని పేరుందని... దాన్ని నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గోదావరి డెల్టాకు జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా నిరంతర వినియోగంలో ఉన్న ఈ కీలక జలవనరుల నిర్మాణానికి సమగ్ర మరమ్మత్తులు, ఆధునీకరణ పనులు చేపట్టేందుకు రూ.152.95 కోట్ల అనుమతులు మంజూరు చేశారు. ఈ పనులకు సీఎం చంద్రబాబు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పిచ్చుకలంక వద్ద గేట్ నంబర్1 వద్ద శంకుస్థాపన చేయనున్నారు.

1847లో సర్ ఆర్థర్ కాటన్ ప్రారంభించి.. 1852లో పూర్తి చేసిన ధవళేశ్వరం ఆనకట్ట గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించేలా చేసి డెల్టా ప్రాంతాన్ని దేశంలోనే అత్యంత సారవంతమైన వ్యవసాయ ప్రాంతంగా మార్చింది. అనంతరం వరదల ప్రభావం, పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1969లో ఆధునిక సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మాణం ప్రారంభమై 1984లో పూర్తయింది. ప్రస్తుతం 5.837 కిలోమీటర్ల పొడవున్న ఈ బ్యారేజీ ద్వారా సుమారు 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. అంతేకాకుండా లక్షలాది మంది ప్రజలకు తాగునీటి ప్రధాన వనరుగా, వరద నియంత్రణలో కీలక వ్యవస్థగా ఇది సేవలందిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా భారీ వరదల ఒత్తిడి, యాంత్రిక భాగాల శిథిలీకరణ కారణంగా బ్యారేజీ ఆధునీకరణ అవసరమని కేంద్ర జల సంఘం, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్, హైడ్రోమెకానికల్ నిపుణుల కమిటీలు సూచించాయి. ఈ సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఆధునీకరణ పనులు చేపడుతోంది. ఇప్పటికే 201415లో తొలి దశలో 175 వరద గేట్లలో 58 గేట్లను రూ.31.77 కోట్ల వ్యయంతో మార్చగా.. ఇప్పుడు మిగిలిన 117 గేట్లను అత్యాధునిక సాంకేతికతతో భర్తీ చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 175 గేట్లకు కొత్త రబ్బర్ సీల్స్, రోలర్ అసెంబ్లీలు, వైర్ రోపులు, మాస్టర్ కంట్రోల్ ప్యానెల్స్, విద్యుత్ కేబుళ్ల మార్పిడి, శాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్ వంటి సమగ్ర పనులు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన బీఈకేఈఎం ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఈ పనులు అప్పగించగా.. రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ ఆధునీకరణ పూర్తయిన తర్వాత బ్యారేజీ భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు వరద నిర్వహణ సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల రైతులు, మత్స్యకారులు, గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది. సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన చారిత్రాత్మక జలవనరుల వారసత్వాన్ని పరిరక్షిస్తూ.. ఆధునిక సాంకేతికతతో భవిష్యత్ తరాలకు మరింత సురక్షితమైన సాగునీటి వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు గోదావరి డెల్టా అభివృద్ధి చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఇరిగేషన్ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు**

ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. తొలుత విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. ప్రాజెక్టు స్పిల్ వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహం, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ మధ్య జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, గ్యాప్ 2లతో పాటు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను సీఎం చంద్రబాబు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను సీఎం పరిశీలించారు. ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు ఉన్నారు.

# రేప్ చేసిన నిందితుడికి జరిమానా ..
# ఆ డబ్బుతో పార్టీ



రేప్ చేసిన నిందితుడికి విధించిన జరిమానా డబ్బుతో ఝార్ఖండ్‌లోని ఓ గ్రామానికి చెందిన పంచాయతీ పెద్దలు పార్టీ చేసుకున్న ఘటన వివాదాస్పదంగా మారింది. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు.
వివరాల్లోకి వెళ్తే గుమ్లా జిల్లాలోని పాల్మా గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై ఇటీవల అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు.
శనివారం సాయంత్రం 4గంటల సమయంలో నిందితుడు సునీల్ లోహ్రా స్థానికంగా ఉండే చిన్నారి ఇంటికి వెళ్లాడు. పాపను తాను కొద్దిసేపు ఆడిస్తానని చెప్పి.. మరో గదిలోకి తీసుకువెళ్లాడు. అనంతరం చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడి.. అక్కడి నుంచి పరారయ్యాడు. పాప ఏడుపు విన్న తల్లి వెంటనే లోపలికి వచ్చి చూసేసరికి చిన్నారికి రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించింది. వెంటనే గ్రామపెద్దలను ఆశ్రయించింది. ఈ నేరం గురించి పోలీసులకు తెలియకుండా ఉంచాలని నిర్ణయించుకున్న గ్రామ పెద్దలు.. చిన్నారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు.
అనంతరం ఈ వ్యవహారంపై విచారణ జరిపిన పంచాయతీ పెద్దలు నిందితుడికి రూ.1లక్ష జరిమానా విధించారు. వెంటనే రూ.20,000 చెల్లించాలని.. మిగిలిన రూ.80వేలను వారం రోజుల్లోగా ఇవ్వాలని ఆదేశించారు.
నిందితుడు ఇచ్చిన రూ.20వేలతో ఆదివారం రాత్రి పంచాయతీ పెద్దలు మాంసం, మద్యంతో పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.
గ్రామ పెద్దలు విందు చేసుకుంటున్న ప్రాంతానికి వెళ్లిన పోలీసులు.. వారిని అరెస్ట్ చేశారు. కాగా ఆ పార్టీలో నిందితుడు కూడా ఉండటం గమనార్హం. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు చిన్నారి తల్లి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎర్రకోట పేలుళ్ల కేసు..
# మృతుల అంత్యక్రియలకు కోర్టు అనుమతి

గతేడాది ఎర్రకోట వద్ద చోటుచేసుకున్న పేలుళ్ల కేసులో మృతుల అంత్యక్రియలకు దిల్లీ కోర్టు నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ కు అనుమతిచ్చింది. బాధితుల మతపరమైన విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని.. పూర్తి గౌరవంతో అంతిమ సంస్కారాలు నిర్వహించాలని సూచించింది. ఆత్మాహుతి దాడిలో మరణించిన ఉగ్ర డాక్టర్ ఉమర్ నబీ శరీర భాగాలను కూడా దహనం చేయాలని న్యాయమూర్తి జస్టిస్ పీతాంబర్ దత్ సూచించారు.
2025 నవంబరు 10న దేశ రాజధాని దిల్లీ లోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఆత్మాహుతికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీతో పాటు 11మంది ప్రజలు మృతి చెందారు. ఈ కేసులో విచారణ నిమిత్తం ఇన్ని రోజులు ఎన్ఐఏ అధికారులు మృతదేహాలను భద్ర పరిచారు. ఇటీవల ఈ కేసుపై జరిగిన విచారణలో మృతుల శరీరాల నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించినట్లు ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. శరీర భాగాలు



కుళ్లిపోయే స్థితికి రావడంతో దహనం చేయడానికి అనుమతినివ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ క్రమంలోనే న్యాయస్థానం అంత్యక్రియలకు అనుమతినిచ్చింది. ఎర్రకోట వద్ద పేలుడు కేసు..
2025 నవంబరు 10న దేశ రాజధాని దిల్లీ లోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు సంభవించింది. ఆ ఘటనలో 11మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో ఎన్ఐఏ 7500 పేజీల ఛార్జ్‌షీట్‌ను రూపొందించింది. ప్రధాన సూత్రధారి ఉమర్ ఉన్ నబీతో (పేలుడులో అతడు మరణించాడు) పాటు మొత్తం 10 మందిని కూడా ఈ జాబితాలో చేర్చింది. దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. 588 మంది నుంచి వాంగ్మూలాలు నమోదు చేసింది. 395కు పైగా పత్రాలు, 200కు పైగా స్వాధీనం చేసుకున్న పరికరాల నుంచి సాక్ష్యాలు సేకరించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ పేలుడు వెనుక జిహాదీ కుట్ర కోణం ఉన్నట్లు ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలు స్పష్టంచేశాయని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది.

# అయోధ్య విరాళాల చోరీపై
# నివేదిక ఇవ్వండి: సుప్రీంకోర్టు ఆదేశాలు

అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ చోరీపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. వీటిని విచారణకు స్వీకరించిన సుప్రీం ధర్మాసనం.. పిటిషన్లపై స్పందించాలని కేంద్రంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఆలయ నిర్వహణను చూస్తోన్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు కూడా నోటీసులు ఇచ్చింది.
సిట్‌లో భాగమైన సభ్యుల వివరాలను కూడా నివేదికలో ప్రస్తావించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఆదేశాల్లో పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వెల్లడించారు. ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ‘‘మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు’’ అని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది.
అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ చోరీపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. వీటిని విచారణకు స్వీకరించిన సుప్రీం ధర్మాసనం.. పిటిషన్లపై స్పందించాలని కేంద్రంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఆలయ నిర్వహణను చూస్తోన్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు కూడా నోటీసులు ఇచ్చింది.
సిట్‌లో భాగమైన సభ్యుల వివరాలను కూడా నివేదికలో ప్రస్తావించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఆదేశాల్లో పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు



వినిపించారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని కోర్టుకు వెల్లడించారు. ఆ నివేదిక ప్రతిని తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. ఆ అభ్యర్థనకు వ్యతిరేకంగా మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ‘‘మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు’’ అని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది.

# కర్ణాటక ఆలయాల్లో హుండీలకు భద్రత పెంపు

కర్ణాటక లోని ఆలయాల్లో హుండీలకు భద్రత పెంచడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హుండీల భద్రతను పటిష్ఠం చేయడం, విరాళాల నిర్వహణలో పారదర్శకత, ఆలయాల్లో నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువుల భద్రతకు ఒక సమగ్ర ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ఒకే విధమైన భద్రత, పర్యవేక్షణను అమలు చేయాలని డిప్యూటీ కమిషనర్లు, తహసీల్దార్లు, ఆలయ ట్రస్టీలు ఇతర అధికారులను ఆదేశించింది. దేశంలోని పలు ప్రముఖ ఆలయాల విరాళాల్లో అవకతవకలు జరుగుతుండడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

**సీసీటీవీలు..క్యూఆర్ కోడ్‌లు**

రాష్ట్రంలోని అన్ని ఆలయ హుండీల వద్ద సీసీటీవీ కెమెరాల ఏర్పాటును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రతినెలా ఈ ఫుటేజీని పర్యవేక్షించాలని జిల్లా అధికారులు, మత ధార్మిక సంస్థలకు సూచించింది. విరాళాలను లెక్కించేసమయంలో పారదర్శకత మెరుగుపరచడానికి యూపీఐ, భీమ్, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డిజిటల్ విరాళాలను ప్రోత్సహించాలని పేర్కొంది. సరైన ఆడిట్ వివరాలు, ఆర్థిక నిర్వహణను నిర్ధరించడానికి, ఈ డిజిటల్ చెల్లింపు వ్యవస్థను దేవాలయ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించాలని సూచించింది. క్యూఆర్ కోడ్‌లను తారుమారు చేయకుండా నిరోధించడానికి వాటిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని పేర్కొంది.
పెద్ద మొత్తంలో విరాళాలు అందుకునే దేవాలయాలు ప్రతి వారం ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వం పేర్కొంది.
ప్రతి హుండీ లెక్కబెట్టే సమయంలో రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని.. దీనిని సంబంధిత తహసీల్దార్ పర్యవేక్షిస్తారని తెలిపింది.




హుండీ తెరిచినప్పటి నుంచి నగదు బ్యాంకులో జమ చేసే వరకు మొత్తం ప్రక్రియను వీడియో రికార్డ్ చేయాలని సూచించింది. హుండీ నుంచి సేకరించిన బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులకు అదే రోజున విలువ కట్టి ఆలయ ఖజానాలో జమ చేయాలని ఆదేశించింది.

# 2 వారాల్లో నిబంధనలు సమర్పించండి..
# విమాన ఛార్జీలపై సుప్రీంకోర్టు

**విమానయాన సంస్థల టికెట్ ఛార్జీల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. భారతీయ వాయుయాన్ అధినియం, 2024 చట్టం కింద రూపొందించిన నిబంధనలు సమర్పించాలని సూచించింది.**
**సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు వెలువరించింది.**
**ప్రైవేటు విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా దోచుకుంటున్నాయని, ఛార్జీల విషయంలో పారదర్శకత పాటించడం లేదంటూ లక్ష్మీనారాయణన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా పండగల సమయంలో ఈ దోపిడీ అధికంగా ఉంటోందని అతని తరఫు న్యాయవాది రవీంద్ర శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. డిమాండ్‌ను బట్టి విమానయాన సంస్థలు ధరలను పెంచకుండా నిరోధించే నిబంధన ఏదీ ప్రస్తుతం లేదన్నారు. దీనిపై స్వతంత్రమైన, పటిష్ఠ నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని న్యాయస్థానం పరిశీలించాలని కోరారు.**
**అయితే, కొత్త చట్టానికి సంబంధించి ముసాయిదా నిబంధనలు రూపొందుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. వాటిని పార్లమెంట్‌కు సమర్పించాల్సి ఉందన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. రెండు వారాలు గడువు ఇస్తున్నామని, సీల్డ్ కవర్‌లో నిబంధనావళిని సమర్పించాలని కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేసింది.**

# పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి: సుప్రీంకోర్టు



పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రక్రియ, అలాగే ఒకరిని విదేశీయుడిగా గుర్తించే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని సుప్రీంకోర్టు (Supreme Court) స్పష్టం చేసింది. అస్సాంలో విదేశీయులుగా ముద్రపడిన 27 మంది పౌరులకు రక్షణ కల్పిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పౌరసత్వం, విదేశీహోదా అనేవి రాజ్యాంగపరంగా, చట్టబద్ధంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశాలని పేర్కొంది. అదే సమయంలో వ్యక్తులు చట్టవిరుద్ధంగా పౌరసత్వాన్ని పొందకుండా నిరోధించే అధికారం భారత ప్రభుత్వానికి ఉందని వెల్లడించింది. మొత్తంగా న్యాయపరమైన ప్రక్రియదే పైచేయి అని తేల్చిచెప్పింది. అలాగే గువాహటి హైకోర్టు, ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను పక్కన పెట్టింది.
పాత ఓటర్ల జాబితాలో టైపింగ్ తప్పిదాలు, స్పెల్లింగ్‌లోని చిన్నచిన్న వ్యత్యాసాలను సాకుగా చూపి, తమను విదేశీయులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ అస్సాంకు చెందిన 27 మంది సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానంలో వారికి ఊరట లభించింది. అయితే వారి పౌరసత్వాన్ని ధ్రువీకరించే ఆధారాలను తాము పరిశీలించలేదని ఈ సందర్భంగా ధర్మాసనం వెల్లడించింది. ట్రైబ్యునళ్లు మరోసారి విచారణ జరిపే వరకు వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు ఉండకూడదని ఆదేశాలు ఇచ్చింది.

# జమ్మూకశ్మీర్ సీఎంపై రూ.100కోట్ల పరువు నష్టం దావా



జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పై రాష్ట్ర భాజపావిభాగం రూ.100కోట్లకు పరువు నష్టం దావా వేసింది. ఈ మేరకు నోటీసులు పంపిన పార్టీ.. ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని పేర్కొంది. భాజపాలో చేరిన ఎమ్మెల్యేలకు చెరో రూ.30కోట్లు.. మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ వంటి ఆఫర్లతో నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యేలను భాజపా కార్యకర్తలు సంప్రదించినట్లు ఒమర్ అబ్దుల్లా అసత్య ఆరోపణలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ సత్పాల్ శర్మ పేర్కొన్నారు. తమ పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.
కాగా, శుక్రవారం శ్రీనగర్‌లో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. భాజపా తమ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా తమ పార్టీ ఎమ్మెల్యేలకు రూ.30కోట్ల నగదు, మంత్రి పదవులను ఆఫర్ చేసిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని.. బహిరంగ క్షమాపణలు చెప్పాలని సత్పాల్ శర్మ డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# గోవధ నిషేధ అంశం.. విజయ్ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట



**గోవధ నిషేధ అంశం పై విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. బక్రీద్, ఇతర రోజుల్లో రాష్ట్రంలో గోవధ జరగకుండా చూసుకోవాలని ఇటీవల తమిళనాడు ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది.**
**గోవధ నిషేధానికి సంబంధించి 1976లో ప్రభుత్వ ఉత్తర్వును అమలు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. వ్యవసాయ ప్రయోజనాలను పరిరక్షించడానికి, పాల దిగుబడిని పెంచేందుకు గోవధను నిషేధించాలన్నది ఆ ఉత్తర్వుల ఉద్దేశం. దీనిని ఆధారంగా చేసుకొనే హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. వీటిని సుప్రీంకోర్టులో విజయ్ ప్రభుత్వం సవాలు చేసింది. నిర్దిష్ట ప్రదేశాల్లో కొన్ని రకాల గోవుల వధకు చట్టం అనుమతిస్తోందని వాదించింది. అలాంటప్పుడు చట్టపరమైన నిబంధనలకు వ్యతిరేకంగా ఉండే న్యాయపరమైన ఆదేశాలు ఇవ్వడం నిలవవని పేర్కొంది. జంతు సంరక్షణ, వధశాలలకు సంబంధించి తగిన చట్టాలు ఉన్నాయని, కానీ అవి పూర్తి నిషేధాన్ని విధించడం లేదని వెల్లడించింది. ఈ వాదనల అనంతరం సుప్రీం స్టే విధించింది.**



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం
14.07.2026





# భారం కాదు, అభివృద్ధికి బాట!

ప్రభుత్వరంగ సంస్థల గురించి ఒక అపోహ దశాబ్దాలుగా ప్రచారంలో ఉంది. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తే ఆ సంస్థలు దివాళా తీస్తాయని, ప్రజలకు రాయితీలు ఇస్తే ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటుందని, అవి ఎప్పటికీ లాభాల్లోకి రావని కొందరు నమ్మించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) సాధించిన చారిత్రాత్మక విజయం ఈ అపోహలన్నింటినీ ఒక్కసారిగా చెదరగొట్టింది. దాదాపు పదేళ్ల పాటు నష్టాలతో పోరాడిన టీజీఎస్ఆర్టీసీ, 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,059 కోట్లకు పైగా మిగులు నమోదు చేయడం కేవలం ఒక ఆర్థిక గణాంకం కాదు. ఇది తెలంగాణ ప్రభుత్వ పాలనాతత్వానికి, దూరదృష్టికి, ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధితో ముడిపెట్టిన ఆలోచనకు దక్కిన ఘన విజయం. దీనిని అర్థం చేసుకోవాలంటే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఒకప్పుడు నష్టాల ఊబిలో కూరుకుపోయిన సంస్థ, రెండేళ్ల వ్యవధిలోనే వరుసగా మిగులు ఎలా సాధించింది? ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీని కేవలం ఒక వ్యాపార సంస్థగా చూడలేదు. ప్రజల జీవితాలను ముందుకు నడిపే సామాజిక బాధ్యత కలిగిన ప్రజాసేవా సంస్థగా చూసింది. అదే ఆలోచన ఈ మార్పునకు పునాది అయింది.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పుడు విమర్శలు వెల్లువెత్తాయి. 'ఆర్టీసీ పూర్తిగా కుప్పకూలుతుంది', 'ఉచిత పథకాలతో సంస్థ దివాళా తీస్తుంది', 'ప్రభుత్వం ప్రజాదరణ కోసం ఆర్థిక వ్యవస్థను పణంగా పెడుతోంది' అంటూ అనేక విమర్శలు వచ్చాయి. మహాలక్ష్మి పథకం వల్ల లక్షలాది మహిళలు మరింత ఎక్కువగా బస్సులను వినియోగించడం ప్రారంభించారు. గ్రామీణ మహిళలు, విద్యార్థినులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగినులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతిరోజూ ధైర్యంగా ప్రయాణిస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల సంఖ్య బస్సుల ఆక్యుపెన్సీని సుమారు 67శాతం నుంచి 98శాతానికి తీసుకెళ్లింది. ఒకప్పుడు ఖాళీగా తిరిగిన అనేక సర్వీసులు నేడు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. అంటే ప్రభుత్వం ప్రజల కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి తిరిగి ఆర్థిక కార్యకలాపాలను పెంచింది. ఇది సంక్షేమం కాదు అని ఎవరైనా చెప్పగలరా? ఇది ఖర్చు కాదు... పెట్టుబడి.

మహాలక్ష్మి పథకానికి ప్రభుత్వం ఆర్టీసీకి సకాలంలో రీయింబర్స్‌మెంట్ అందించింది. ఈ నిర్ణయం వల్ల సంస్థలో నగదు ప్రవాహం మెరుగుపడింది. ఒకవైపు మహిళలకు ఉచిత ప్రయాణం, మరోవైపు సంస్థకు ఆర్థిక భద్రత. ఇదే తెలంగాణ మోడల్ ప్రత్యేకత. దేశంలో అనేక రాష్ట్రాల్లో సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ మధ్య సంఘర్షణ కనిపిస్తుంటే, తెలంగాణ మాత్రం రెండింటినీ సమన్వయం చేసి చూపించింది. ఈ విజయాన్ని కేవలం మహాలక్ష్మి పథకానికే పరిమితం చేయడం సరైంది కాదు.

టీజీఎస్ఆర్టీసీలో ఒకేసారి అనేక సంస్కరణలు అమలయ్యాయి. వ్యయ నియంత్రణ, డిజిటల్ టికెటింగ్ విస్తరణ, అద్దె బస్సుల సమర్థ వినియోగం, మార్గాల శాస్త్రీయ పునర్వ్యవస్థీకరణ, టోల్, సేఫ్టీ సెస్ రౌండ్- ఆఫ్ వంటి ఆదాయ వనరుల పెంపు, ఇంధన వినియోగంలో క్రమశిక్షణ, ప్రతి డిపోలో పనితీరు సమీక్ష– ఇవి అన్నీ కలిసి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేశాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలు అంటే ఉద్యోగులను తగ్గించడం కాదని, నిర్వహణను మెరుగుపరచడమే నిజమైన సంస్కరణ అని తెలంగాణ నిరూపించింది.

ఏ ప్రభుత్వ విధానం అయినా దాన్ని విజయవంతం చేసేది ఉద్యోగులే. క్లిష్టపరిస్థితుల్లోనూ సంస్థను నిలబెట్టిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, అధికారులు, కార్మిక సంఘాలు ఈ విజయానికి అసలైన భాగస్వాములు. ప్రజలకు చిరునవ్వుతో సేవలందించిన వారి కృషి లేకపోతే ఈ ఫలితం సాధ్యమయ్యేది కాదు. వారి శ్రమకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవం ఇస్తుంది. ఒక సంస్థకు ప్రభుత్వం మూలధనం ఇవ్వగలదు. కానీ ప్రజల విశ్వాసాన్ని కొనివ్వలేదు. టీజీఎస్ఆర్టీసీపై తెలంగాణ ప్రజలు చూపించిన నమ్మకం ఈ విజయానికి మరొక కారణం. ప్రైవేట్ వాహనాల కంటే ప్రజా రవాణాను ఎంచుకోవడం ద్వారా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు, ఇంధన పొదుపునకు, రోడ్డు భద్రతకు కూడా తోడ్పడ్డారు.

ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఒకే లక్ష్యంతో సాగుతోంది. అది ప్రజల జీవితాలను మెరుగుపరచడం. విద్య, వైద్యం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, ఉపాధి, మౌలిక సదుపాయాలు... ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. టీజీఎస్ఆర్టీసీ విజయం కూడా అదే దృక్పథానికి ప్రతిబింబం.

ఈ విజయం అంతిమ గమ్యం కాదు. ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణ, గ్రీన్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫ్లీట్ మేనేజ్‌మెంట్, ఆధునిక బస్ స్టేషన్లు, మహిళల భద్రత, డిజిటల్ సేవలు, ఉద్యోగుల సంక్షేమం– ఇవన్నీ రాబోయే సంవత్సరాల్లో టీజీఎస్ఆర్టీసీ అభివృద్ధి ప్రాధాన్యతలు. దేశానికి ఆదర్శంగా నిలిచే ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఒకప్పుడు నష్టాల వార్తలతో నిలిచిన టీజీఎస్ఆర్టీసీ, నేడు విజయగాథగా మారింది.

సంక్షేమం సక్రమమైన ఆర్థిక నిర్వహణతో కలిస్తే ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడవు... మరింత బలపడతాయి. ప్రజల విశ్వాసం, ఉద్యోగుల అంకితభావం, ప్రభుత్వ దూరదృష్టి ఒకే దిశగా సాగితే అసాధ్యం అనుకున్న లక్ష్యాలూ సుసాధ్యం అవుతాయి. టీజీఎస్ఆర్టీసీ చరిత్రలో నమోదైన ఈ మిగులు కేవలం ఆర్థిక లాభం కాదు. ఇది తెలంగాణ అభివృద్ధి తత్వానికి, సమర్థ పాలనకు, ప్రజలతో కలిసి నడిచే ప్రభుత్వానికి చిరస్థాయి గుర్తింపు.

# డేటా సెంటర్లపై బేజారు

చార్లీ చాప్లిన్ అద్భుత దృశ్యకావ్యాల్లో ఒకటైన 'గోల్డ్ రష్' నిరుడు శతవసంతాలు పూర్తిచేసుకుంది. 1890ల్లో కెనడాలోని క్లోన్‌డైక్ ప్రాంతంలో బంగారం గనులున్నాయని వెల్లడై ప్రపంచం నలుమూలలనుంచీ వేలాదిమంది జనం అక్కడికి పరుగులు తీయడం, పోటీపడటం కథాంశం. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించిన డేటా సెంటర్లలో పెట్టుబడుల్ని ఆకర్షించటానికి అలాగే పరుగులు తీస్తున్నాయి. నిరుడు అక్టోబర్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం విడుదల చేసిన విశ్లేషణ డేటా సెంటర్ల సామర్థ్యం మరో నాలుగేళ్లలోనే మూడు రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది. అదే సమయంలో తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువుకాటకలు, ఇతర వాతావరణ దుష్ఫలితాల కారణంగా డేటా సెంటర్ల వార్షిక ఖర్చులు 2035కు 8,100 కోట్ల డాలర్లనుంచి 2065 నాటికి 16,800 కోట్ల డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. ఇప్పటికే క్లౌడ్ కంప్యూటింగ్ నిర్వహించటానికి... ఓటీటీలు, యూట్యూబ్‌వంటి వాటికోసం లైబ్రరీల నిర్వహణకూ, ఇతరేతర వినియోగానికీ డేటా



సెంటర్లున్నాయి. ఏఐ రాకతో ఇవి మరింతగా పెరుగుతున్నాయి.

డేటా సెంటర్ల విస్తరణతోపాటే వాటికి సంబంధించిన అవగాహన మొదలైంది. వాటివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తోంది. ఆన్‌లైన్ సెర్చ్‌లతో పోలిస్తే ఏఐ ఆధారిత సెర్చ్‌లు పది రెట్లు అధిక విద్యుత్‌ను తీసుకుంటున్నా యని గణాంకాలు తేల్చాయి. ఈమధ్య విడుదలైన ఐక్యరాజ్యసమితికి చెందిన యూనివర్సిటీ అధ్యయన నివేదిక డేటా సెంటర్లను చల్లబరచడానికి బిలియన్లకొద్దీ లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు ఆవిరైపోతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డేటా సెంటర్ల వల్ల తాగునీటి హక్కులకూ, వ్యవసాయానికీ తీవ్ర విఘాతం కలుగుతోందని హెచ్చరించింది. వీటిని అనుమతించే ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో పునరుత్పాదక ఇంధన వనరు లున్న ప్రాంతాలనే ఎంచుకునేలా చూడాలని సూచించింది. వినియోగిస్తున్న నీరు ఆవిరయ్యే ప్రస్తుత విధానానికి బదులు నీటి అవసరం లేని ఎయిర్ కూలింగ్, లిక్విడ్ ఇమ్మర్షన్ కూలింగ్‌వైపు మారేలా డేటా సెంటర్లపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వాలకు సలహా ఇచ్చింది. డేటా సెంటర్లు తాము వినియోగించే నీరు, విద్యుత్ ఎంతో... విడుదలయ్యే కర్బన ఉద్గారాల పరిమాణం ఎంతో తెలిపే డేటాను అందరికీ అందుబాటులో ఉంచేలా నిబంధనలు రూపొందించాలని తెలిపింది.

డేటా సెంటర్లపై అక్కడక్కడా ఆందోళనలు పెరుగుతున్నాయి. ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో ఈ సెంటర్లు పెరగటాన్ని నిరసిస్తూ ఉద్యమాలు జరగటంతో కొత్తవాటిపై కఠిన మైన ఆంక్షలు విధించారు. నెదర్లాండ్స్‌లో కూడా రైతులు, పర్యావరణవేత్తలు ఆందోళనలు చేశారు. దాంతో హైపర్‌స్కిల్ డేటాసెంటర్ల నిర్మాణాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధించింది. సింగపూర్‌లో పర్యావరణహిత సెంటర్లకు పరిమితమైన అనుమతు లిస్తున్నారు. చిలీలో డేటా సెంటర్ ఏర్పాటుపై జనం తిరగబడటంతో గూగుల్ సంస్థ గాలితో చల్లబరిచే సాంకేతికత దిశగా ప్రాజెక్టును డిజైన్ చేసుకుంది.

ఏడాదిలో 365 రోజులూ వేలాది సర్వర్ రాక్‌లూ, డిజిటల్ డేటాను భద్రపరిచే హార్డ్ డ్రైవ్‌లూ, నెట్‌వర్కింగ్ పరికరాలూ, లక్షలసంఖ్యలో యూపీఎస్‌లు పనిచేస్తుండటంవల్ల వాటిని చల్లబరచటానికి నిరంతరాయంగా నీరు అవసరమవుతుంది. భారీగా విద్యుత్ కావలసివస్తుంది. ఇక ఆ సెంటర్లలోవాడే భారీ కూలింగ్ ఫ్యాన్లు , ఇండస్ట్రియల్ ఏసీల వల్ల ఒకరకమైన ధ్వని తప్పదు. పగలు ఇతర చప్పుళ్లతో ఇది కలిసిపోయినా, రాత్రివేళల్లో మూడు నాలుగు కిలోమీటర్ల మేర ఈ ధ్వని వినబడుతుంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో, అమెరికాలోని వర్జీనియాలో కేవలం ఈ కారణం వల్లే స్థానికులు కోర్టులకెక్కారు.

ప్రజల ఒత్తిళ్లతో ఈమధ్య కాలిఫోర్నియాలోని ఒక మున్సిపాలిటీ కొత్త డేటా సెంటర్లపై నిషేధం విధించింది. వీటన్నిటి నేపథ్యంలో నీటి అవసరం పెద్దగా లేని సాంకేతికతలు వస్తున్నాయి. ఏఐ ఆధారిత సాంకేతికత ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అదనంగా వినియోగించకుండా కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరిస్తే, ఆ సెంటర్లు వినియోగించే పర్యావరణహిత సాంకేతికతల సమాచారాన్నీ, వాటి ఉద్గారాల పరిమాణాన్నీ ప్రజలకూ, పర్యావరణవేత్తలకూ అందుబాటులో ఉంచితే ప్రజల్లో ఉండే ఆందోళన తగ్గుతుంది.

# అవినీతికి జవాబుదారీ ఎవరు?

బాబ్రీ మసీదు కట్టడాన్ని కూల్చివేసిన రోజు (డిసెంబర్ 6, 1992) ముందు రాత్రి అయోధ్యలో సీనియర్ ఆర్ఎస్ఎస్ సభ్యుడు, జర్నలిస్టు, రామజన్మభూమి ఉద్యమం సమయంలో మీడియా వ్యవహారాలను పర్యవేక్షించిన రమా శంకర్ అగ్నిహోత్రిని కలుసుకున్నాను. ఆయన పక్కనే ఉన్న ఫైజాబాద్ (అయోధ్య) ఎంపీ వినయ్ కతియార్ నాకు కరసేవ గురించి సమాచారం ఇచ్చారు. భజరంగ్‌దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా ఆయన రామ జన్మభూమి ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన వారిలో ఒకరు. అశోక్ సింఘాల్, వినయ్ కతియార్, కల్యాణ్ సింగ్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువు మహంత్ వైద్యనాథ్, ఉమాభారతి, సాధ్వి రితంభర వంటి నేతలు లేకపోతే రామజన్మభూమి ఉద్యమమే లేదు. రామ్ రథయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లిన అద్వాణీ ఈ ఉద్యమానికి రాజకీయ రూపమే కాని, అసలు ఉద్యమం నిర్వహించిన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ వంటి శక్తులు వేరు. అయోధ్య నుంచి మూడుసార్లు గెలిచిన వినయ్ కతియార్ 'మందిర్ వహీ బనాయేంగే' వంటి నినాదాలతో ప్రాచుర్యం పొందారు.



అలాంటి వినయ్ కతియార్ ఇవాళ అయోధ్యలో జరుగుతున్న పరిణామాలను తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆలయంలో ఉన్న హుండీల నుంచి భారీ ఎత్తున నగదు, ఆభరణాలను దోచుకోవడంపై ఆయన తీవ్ర మనస్తాపం ప్రకటించారు. 'ప్రస్తుతం ఉన్నవారందరూ దొంగలే' అని ఆయన అన్నారంటేనే పరిస్థితి తీవ్రత మనకు అర్థమవుతుంది. వినయ్ కతియార్ మాత్రమే కాదు, అనేకమంది సాధువులు కూడా ఈ దోపిడీని ఖండించారు. 'నిధులు దోచుకున్నవారు రావణులు' అని భాగేశ్వర్‌ధామ్ అధినేత ధీరేంద్ర కృష్ణశాస్త్రి అన్నారు. స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి, ప్రవచనకర్త దేవకీనందన్ ఠాకూర్, మహంత్ కమల్‌నయన్ దాస్ వంటి సాధువులు ఎందరో ఈ దోపిడీ వెనుక శక్తిమంతులు ఉన్నారని ఆరోపించారు. 'ఈ విషయంలో నేను నిజం చెపితే సమస్యల్లో పడతాను' అని బీజేపీ మాజీ ఎంపీ ఒకరు అన్నారు. ఆలయ నిర్మాణం, ఆస్తుల నిర్వహణ, ప్రజల విరాళాలను నిర్వహించేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచే ఈ నిధులను కొల్లగొడుతున్నారని, భక్తులు సమర్పించిన బంగారం, వెండి, నగలపై ఎవరూ సరిగా లెక్కలు రాయలేదని ట్రస్టు మాజీ సీఈఓ మహిపాల్‌సింగ్ ఆరోపించారు. ఓచర్లకూ, నగదు, నగలకు మధ్య పొంతన లేదని ఆయన ఎత్తి చూపిన తర్వాత దర్యాప్తు చేసేందుకు బదులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. 2026 జూన్ 7న ఈ విషయం సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ ప్రస్తావించి, న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేసిన తర్వాతే అయోధ్య విరాళాల బాగోతం బయటకు పొక్కింది. బ్యాంకు ఖాతాలు, ట్రస్టు ఖాతాలను ప్రజలకు చూపించి పారదర్శకంగా వెల్లడించాలని బీజేపీ నేత రజనీష్‌సింగ్ నేరుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఎట్టకేలకు జూన్ 13న ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించింది.

అయోధ్యలో రామజన్మభూమి కోసం భక్తులు ఎంత పెద్ద సంఖ్యలో విరాళాలు, ఆభరణాలు, బంగారం, వెండి ఇటుకలు సమర్పించారో లెక్క తెలియదు. అక్షింతల పంపిణీ పేరిట, 'రామ్ రామ్ గ్రామ్ అభియాన్' పేరిట నిర్వహించిన కార్యక్రమాలకు అనేకమంది భక్తులు తాదాత్మ్యంతో ప్రతిస్పందించారు. సీసీటీవీ కెమెరాల్లో కనీసం 70సార్లు నగదు తీసుకువెళుతున్నట్లు, మూటలు మోసుకెళుతున్నట్లు దృశ్యాలు బహిర్గతమయ్యాయి. సిబ్బంది కొందరు కావాలనే కెమెరాలకు అడ్డుగా నిలుచుని హుండీల నుంచి నగదు కాజేసే దృశ్యాలు రికార్డు కాకుండా చేశారని సిట్ తేల్చింది. దోచుకున్న డబ్బుతో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారన్న సమాచారం కూడా లభించింది. సిట్ అరెస్టు చేసిన వారిలో నోట్లు లెక్కపెట్టే కొందరు అధికారులు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి, వీహెచ్‌పీ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు చంపత్‌రాయ్ బన్సల్, ఆయన వ్యక్తిగత డ్రైవర్ రమాశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్ తదితరులు ఉన్నారు. కానీ బాధ్యత వహించాల్సిన చంపత్ రాయ్ బన్సల్, ట్రస్టీ అనిల్ మిశ్రాలు కేవలం రాజీనామాలు చేశారు. అనిల్ మిశ్రా అయోధ్యలో అధునాతన సౌకర్యాలతో మూడంతస్తుల బ్రహ్మాండమైన బంగళాను నిర్మించుకున్నారని వార్తలు వచ్చాయి. నిజానికి అయోధ్యలో కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ వ్యవహారాలు నడిపిన అలోక్ బన్సల్, ఆయన సతీమణి శివానీ బన్సల్, చందన్ రాయ్ బన్సల్, మనీష్ బన్సల్ తదితరులు చంపత్ రాయ్ బంధువర్గీయులే, సిట్ స్వాధీనం చేసుకున్న అనేక భూమి కొనుగోళ్ల పత్రాలు మీడియాకు చేరాయి. మహారాష్ట్రకు చెందిన కర్ణాటక ప్రాంత ప్రచారక్, వీహెచ్‌పీ కేంద్ర జాయింట్ సెక్రటరీ గోపాల్‌రావును పరిపాలనా అధికారిగా నియమించింది. చంపత్ రాయ్ తర్వాత అత్యంత శక్తిమంతుడైన గోపాల్‌రావు అయోధ్యలో అనేక ఉడుపి హోటల్స్ సృష్టికర్త అని కూడా సమాచారం.

రామమందిర ఉద్యమం అనేదే లేకపోతే భారతీయ జనతా పార్టీయే లేదు అన్నది పూర్తిగా సత్యదూరం కాదు. బీజేపీ ఉత్థానంలో రామజన్మభూమి పాత్ర ఉన్నదన్న విషయం లాల్‌కృష్ణ ఆద్వాణీయే తన జీవిత చరిత్రలో వివరించారు. రామజన్మభూమి ఉద్యమాన్ని స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద ప్రజా ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. సోమనాథ్ నుంచి ఆయన రథయాత్ర జరిపిన తర్వాతే 1991 ఎన్నికల్లో బీజేపీకి 120 సీట్లు లభించాయి. 1998లో బీజేపీ ఎన్నికల ప్రణాళికలో రామమందిరం గురించి వాగ్దానం చేసింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. మతం పట్ల ప్రజలకు ఉన్న మమేకతను సానుకూల దిశలో మళ్లించినట్లయితే ఒక అద్భుతమైన శక్తిగా తీర్చిదిద్దగలమని నిరూపించామని, ఒక దేశ ఆత్మ వ్యక్తీకరణతో ప్రజల సామూహిక వ్యక్తీకరణ కలిసికట్టుగా ప్రతిధ్వనించిందని ఆయన ప్రకటించారు. తన ఉద్యమం ద్వారా నిద్రాణంగా ఉన్న హిందుత్వను మేలుకొల్పాలని భావించిన ఆద్వాణీ రాముడిని భారత జాతీయ వ్యక్తిత్వానికి, సమైక్యతకు, సమగ్రతకు విశిష్టమైన సంకేతంగా అభివర్ణించారు. ఈ ఉద్యమం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ రామ జన్మభూమి కోసం చేసిన ఎన్నో త్యాగాలు పరమార్థం కోల్పోయినట్లు కనిపిస్తోంది.

కొన్ని దశాబ్దాలుగా రామాయణం ఈ దేశంలో సమున్నత నైతిక విలువల వ్యవస్థను ప్రభావితం చేసిందని ఆద్వాణీ లాంటి వారు భావించారు. మతానికీ, మత వ్యవస్థకూ రామాయణం అతీతమైనదని ఆర్ష విజ్ఞాన ట్రస్టును నెలకొల్పిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి పమిడిఘంటం కోదండరామయ్య రాశారు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నట్లుగా రాముడు రూపుదాల్చిన ధర్మం కనుకనే భారతదేశంలో రామాయణం కలకాలం నిలిచిందని ఆయన తన 'రామాయణ ప్రభ' గ్రంథంలో పేర్కొన్నారు. శ్రీరాముడి సత్యసంధత గురించి వాల్మీకి రామాయణంలో అడుగడుగునా ప్రస్తావించారని, ఆ సత్యవాక్పరిపాలనే యుగయుగాలుగా భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసిందని ఇలపావులూరి పాండురంగారావు వంటి పండితులు చెప్పారు. రాముడిని మూర్తీభవించిన ధర్మదేవతగా మారీచుడితో వాల్మీకి చెప్పించారు. రాముడు సత్యపరాక్రముడని, సత్య ధర్మ పరాయణుడని, సత్యసంధుడని, సత్యశీలుడని, సత్యమే ఆత్మగా కలవాడని వాల్మీకి ప్రశంసించారు. 'సత్యమొక్కటే దైవం, లోకంలో భక్తికి ఆధారభూతం సత్యమే. అన్నిటికీ మూలమున్నది సత్యంలోనే. సత్యానికి మించి ఉన్నత లక్ష్యం లేనే లేదు' అని వాల్మీకి చెప్పారు. 'ధర్మం పుట్టేది బలంలోంచి. (బలో ప్రతిష్ఠో ధర్మః ధరణ్యామివ జంగమం.) 'ధర్మమూ, బలమూ సత్యానికి తోడయితే ఏ మహా విపత్తు నుంచైనా కాపాడగలుగుతాయి' అని ఆయన సూత్రీకరించారు. సత్యం ద్వారా సమస్త లోకాన్ని జయించవచ్చునని అన్నారు. 'నాకు ధన కనక వస్తు వాహనాలపై మోహం లేదు నాకు కావల్సింది రాజ్యం కాదు (నా హమర్థ పరో దేవి లోకమావస్తు ముత్సహే)' అని రాముడితోనే వాల్మీకి చెప్పిస్తారు.

కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి? రామాయణం అంటే రాముడు నడిచిన దారి అని అర్థం. ఆ దారిలో మనం నడుస్తున్నామా? ఇవాళ బలవంతులు సత్యానికీ, ధర్మానికీ అండగా ఉన్నారా? అధికారం కంటే దేశమే ముఖ్యమని భావిస్తున్నారా? రామమందిరం నిర్మించి రాముడి విగ్రహం ప్రతిష్ఠాపిస్తే సరిపోతుందా? దేశంలో అంతటా సత్యం, ధర్మం అనే వాటికి ఏ మాత్రం విలువ లేదని, స్వప్రయోజనాలు, ధనార్జన, అధికార ఆకాంక్ష, దౌర్జన్య పాలనే ధ్యేయంగా మారిందని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. 'అధికారం అవినీతికి దారితీస్తుంది. సంపూర్ణ అధికారం సంపూర్ణ అవినీతికి దారితీస్తుంది' అన్న సూక్తిని ఇతర పార్టీలతో పాటు బీజేపీ నేతలు కూడా నిరూపిస్తున్నారు. సంఘ్ పరివార్‌లో సైతం కొందరు అవినీతికి అతీతులు కాదని తేలింది. ఇవాళ బీజేపీలోనూ, సంఘ్‌లోను నానాజీ దేశ్‌ముఖ్, కుశాభావు ఠాక్రే, జేపీ మాథుర్, భైరాన్ సింగ్ షెఖావత్, లక్ష్మణ రావు ఇనామ్‌దార్ వంటి నీతిమంతుల కోసం అన్వేషించాల్సి వస్తోంది. ఆలయం నిర్వహణను సంఘ్ నుంచి ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకునేందుకో లేక యోగి ఆదిత్యనాథ్‌ను ఇరకాటంలో పెట్టేందుకో అయోధ్య విరాళాల దోపిడీని రచ్చ కెక్కించారన్న ప్రచారం కూడా జరుగుతోంది. దేశ రాజకీయాల్లో బీజేపీ పట్టు పూర్తిగా బిగుస్తుందనుకున్న సమయంలో ఆ పార్టీ పురోగతికి కారణమైన అయోధ్యలో దోపిడీ జరగడం ఒక దుష్పరిణామం. ఈ పరిణామం ప్రజల్లో కలవరం సృష్టిస్తోంది. ఇవాళ అయోధ్యలో న్యాయవాదులు కూడా దోపిడీదారుల తరఫున వాదించేందుకు నిరాకరిస్తున్నారు. ఇది ఒక రాజకీయ పార్టీపైనో, ఆర్ఎస్ఎస్ లాంటి హిందూ ధర్మానికి కట్టుబడ్డామని చెప్పుకుంటున్న సంస్థపైనో వచ్చిన కళంకం కాదు. దేశంలో శ్రీరాముడిని, రామాయణాన్ని ఆరాధించే ప్రజల మనసులపై ఏర్పడ్డ గాయం. ఏ రాముడి బాణం బీజేపీ ఉత్థానానికి కారణమయిందో అదే బాణం బీజేపీ పతనానికి కారణం కాకుండా చూసుకోవల్సిన బాధ్యత ఆ పార్టీ నేతలపై ఉన్నది.

# బహుముఖ వ్యూహం అత్యవసరం!

విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విదేశాలకు వలసపోవడం మామూలే. స్వదేశంలో యుద్ధాలూ సాయుధ ఘర్షణలూ మానవహక్కుల ఉల్లంఘనలు తీవ్రతరమైనప్పుడు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పరాయి దేశాలకు వెళ్లి ఆశ్రయం కోరడమూ సహజమే. వలసదారులైనా, శరణార్థులైనా కచ్చితంగా పాటించాల్సిన నియమ నిబంధనలు కొన్ని అన్ని దేశాల్లోనూ ఉంటాయి. వాటిని ఖాతరుచేయకుండా అక్రమంగా చొరబడి, మారుపేర్లతో గుర్తింపు పత్రాలు సంపాదించి, స్థానికులుగా చలామణీ అయ్యే విదేశీయుల వల్ల సంక్లిష్ట సమస్యలెన్నో చుట్టుముడతాయి. మౌలిక వసతులపై ఒత్తిడితో పాటు సర్కారీ ఖజానాపై భారం పెరగడం, శ్రామిక విపణిలో పోటీ అధికమవ్వడం, భూవివాదాలు నెలకొనడం వంటివి చోటుచేసుకుంటాయి. జనాభా నిష్పత్తి మారిపోవడం మూలంగా స్థానిక సంస్కృతీ సంప్రదాయాలు దెబ్బతింటాయి. దానివల్ల జనసమూహాల నడుమ తరచూ ఉద్రిక్తతలు చెలరేగుతాయి. ఓటర్ల జాబితాల్లోకి చేరే విదేశీయుల వల్ల ఎన్నికల ప్రక్రియ పవిత్రత మంటగలిసి ప్రజాస్వామ్యం పెళుసుబారిపోతుంది. దొంగచాటుగా దేశంలోకి ప్రవేశించి జుగుప్సాకర నేరాలకూ ఉగ్రవాద భావజాల వ్యాప్తికి పాల్పడే ప్రబుద్ధులతో జాతీయ భద్రతకే ముప్పు ముంచుకొస్తుంది. అంతగా నిఘాలేని సరిహద్దులను సులువుగా దాటేసి వచ్చి, వివిధ ప్రాంతాల్లో తిష్ఠవేసిన విదేశీయులతో భారతావని ఇలాంటి ప్రమాదాలనే ఎదుర్కొంటోంది!

దక్షిణాసియాలోని మిగిలిన దేశాలతో పోలిస్తే పరిస్థితులు మెరుగ్గా ఉండటంతో స్వతంత్ర భారతానికి ఆది



నుంచీ అనధికార వలసలు పోటెత్తుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి ఇవి పెద్దయెత్తున జరుగుతున్నాయి. 1997లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు ఇచ్చిన సమాచారం ప్రకారం, అప్పటికే దాదాపు కోటి మంది బంగ్లాదేశీయులు భారత్‌లో అక్రమంగా నివసిస్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు అంటూ రాజ్యసభలో కేంద్రం చెప్పిన వివరాలను బట్టి చూస్తే 2016 నాటికి మన దేశంలోకి రెండు కోట్ల మంది వరకు బంగ్లా వాసులు చొరబడ్డారు. ఆపై వారి సంఖ్య ఎంత పెరిగిందో ఎవరికీ తెలియదు కానీ, ఒక్క హైదరాబాద్‌లోనే 21వేల మందికి పైగా అక్రమ విదేశీ వలసదారులు ఉన్నారన్నది అధికారవర్గాల తాజా అంచనా! 2014 నుంచి 2025 నవంబర్ మధ్యకాలంలో బంగ్లాదేశ్ బోర్డర్‌లో 8632 చొరబాటు యత్నాలను భగ్నం చేసినప్పటికీ రాత్రిపూట నదీ మార్గాల మీదుగా చాలామంది దేశంలోకి అడుగుపెడుతున్నారని కథనాలు వెలువడుతున్నాయి. నిరుడు డిసెంబర్ నాటికి పాక్ సరిహద్దుల్లో 93శాతం మేర కంచె నిర్మాణం పూర్తయ్యింది కానీ, భారత్‌బంగ్లా మధ్యలోనే ఇంకా 21శాతం భూభాగంలో ఫెన్సింగ్ వేయాల్సి ఉంది. అక్కడ నిఘాను కట్టుదిట్టం చేయడంతో పాటు డబ్బుకోసం అక్రమ వలసదారులకు ఆధార్, రేషన్, ఓటర్ కార్డులను సమకూర్చుతున్న ముఠాలూ అవినీతి అధికారగణాలపై ఉక్కుపాదం మోపాలి! అనధికార వలసలను కట్టడి చేసేందుకు చట్టాలను పటిష్ఠపరచాలని; నిబంధనలకు విరుద్ధంగా నివసిస్తున్న విదేశీయులను వేగంగా గుర్తించి, విచారించి, తిప్పి పంపేందుకు ఏకీకృత వ్యవస్థను ఏర్పరచాలని లా కమిషన్ పాతికేళ్ల కిందటే సిఫార్సు చేసింది. సామాజిక సంక్షోభాలకు అంటుకడుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి దేశానికి సమగ్ర బహుముఖ జాతీయ విధానం అవసరమని; ముఖ్యంగా ఆర్థిక అవసరాలతో వలసవచ్చేవారు, శరణార్థుల నడుమ సహేతుక విభజనకు ప్రత్యేక శాసనం అత్యావశ్యకమని రక్షణ, న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. చొరబాట్లు తదితర కారణాలతో జనాభాలో వచ్చే మార్పులపై అధ్యయనానికి కేంద్రం ఇటీవల నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వీటన్నింటిపై దృష్టిసారించాలి!








# నిండా... నిర్లక్ష్యం...!!

- ప్రభుత్వ పాఠశాలలపై విద్యాధికారులు నిర్లక్ష్యం..
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
- జూన్ మాసం మొదలై రెండు నెలలు అవుతున్న అరకొరక పుస్తకాలతో విద్యార్థుల చదువులు.
- మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ లు) తనిఖీలు నిల్.
- ఎంఈఓ లు ప్రైవేట్ పాఠశాలలపై మొగ్గు... ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోని వైనం.
- పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజనాలపై పర్యవేక్షణ నిల్....
మెనూ పాటించని మధ్యాహ్న భోజన ఏజెన్సీలు.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**

**జులై 13, అనంత జనశక్తి న్యూస్:**

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయాల్సిన ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది విద్యార్థులకు కొన్ని పుస్తకాలు మాత్రమే అందగా, మరికొందరికి ఇప్పటికీ ఏ పుస్తకాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు పాఠాలను సక్రమంగా అభ్యసించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠ్య బోధనలో ఇబ్బందులు పడుతున్నారు.

**నిర్లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు:**

ఈ సమస్యపై విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం కొనసాగుతుండగా, ప్రైవేటు పాఠశాలల పైనే అధికారులు ఎక్కువ దృష్టి సారిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, అందుకు తగిన చర్యలు కనిపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మధ్యాహ్న భోజన పై తనిఖీలు నిల్:**

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం పైనా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఉడకని అన్నం, నీళ్ల చారు, అర కొరక గుడ్డు, కనిపించని చిక్కీలు, పోషకాలు లేని ఆహారం తో విద్యార్థులకు మరో ప్రధాన సమస్యగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఆకలి కేకలుగా మారింది. నాణ్యతలేని కూరగాయలు, కుళ్ళిన, తక్కువ ధరలతో కూరగాయలు కొని భోజన నాణ్యతను తగ్గిస్తున్నారు. దాంతో విద్యార్థులు తక్కువ సంఖ్యలో భోజనాలు చేస్తున్నప్పటికీ పాఠశాల హాజరు శాతం ద్వారా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వారికి లాభాన్ని చేకూరుస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. నాణ్యతలేని భోజనంతో విద్యార్థులు అర్థ కడుపుతోనే ముగించే పరిస్థితి, మరి కొంతమంది విద్యార్థులు ఖాళీ కడుపులతో ఇంటి దారి పట్టాల్సిన పరిస్థితి నెలకొంది, మరికొందరు ఇంటి దగ్గర నుంచి భోజనం క్యారీలు తీసుకొస్తున్న పరిస్థితి దాపరిస్తోంది. ప్రధానోపాధ్యాయులు పరిశుభ్రత, మెనూ అమలుపై క్రమం తప్పకుండా తనిఖీలు జరపాల్సిన అవసరం ఉన్నప్పటికీ, చాలా చోట్ల అవి జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు) పాఠశాలలను తరచూ సందర్శించి పర్యవేక్షించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మనబడి... మన భవిష్యత్తు కార్యక్రమాలు అధికంగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. అనేక పనుల నిమిత్తం సాకు చూపిస్తూ.... తనిఖీలు చాలా అరుదుగా జరుగుతున్నాయని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెబుతున్నారు.

**పాఠశాలలపై సమగ్ర తనిఖీలు జరగాలి.**

రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం భోజన పథకాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన అవసరం. విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, విద్యా ప్రమాణాలకు కీలకమైన పథకం అని చెప్పవచ్చు లక్షలాదిమంది విద్యార్థులకు పోషకాహారాన్ని అందించే ప్రధాన సంక్షేమ కార్యక్రమం. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఈ పథకం అమలులో అనేక లోపాలు కనిపిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. పలు పాఠశాలల్లో నిర్ణయించిన మెనూ పూర్తిగా అమలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల గుడ్లు, పండ్లు, ఆకు కూరలు, చిక్కీలు, రాగి జావా ఇతర పోషక పదార్థాలు నిర్ణీత రోజుల్లో అందించలేదని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వంట శాలల పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యం , వంట పాత్ర నిర్వహణ వంటి అంశాలలో లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిపై పూర్తి సమగ్ర తనిఖీ విద్యాశాఖ అధికారులు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.





**చిక్కీలు, రాగి జావా సరఫరాలో అలసత్వం.**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషక ఆహారం అందించాలన్న ఉద్దేశంతో మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా రాగి జావా, పోషక విలువలు అధికంగా ఉన్న చిక్కిలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాగి లో కాల్షియం, ఐరన్, పీచు పదార్థాలు సమృద్ధిగా ఉండడంతో పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. చిక్కిలో కూడా ప్రోటీన్లు శక్తినిచ్చే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇలాంటి ఆహారం క్రమం తప్పకుండా అందితే విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగు పడడంతో పాటు పోషకాహార లోపం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే కొన్ని పాఠశాలల్లో రాగి జావా, చిక్కీలు నిర్ణీత రోజుల్లో అందించలేదని సరఫరాలో ఆలస్యం కారణంగా విద్యార్థులు వాటి ప్రయోజనాన్ని కోల్పోతున్నారు.

**ఆరోగ్యంతో రాజీ వద్దు....**

రాగి జావా, చిక్కీలు కేవలం అదనపు ఆహార పదార్థాలు మాత్రమే కాదు. పిల్లల ఆరోగ్యాన్ని బలోపేతం చేసే పోషకాహారం. వాటి సరఫరాలో నిర్లక్ష్యం విద్యార్థుల ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం, ఆస్కారం ఉంటుంది. అందువల్ల సంబంధిత విద్యాశాఖ సమన్వయంతో పనిచేసి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది.

**చిక్కీలో మార్పు:**

గతంలో బెల్లం, వేరుశెనగ కలయికతో కూడిన చిక్కిలను ప్రభుత్వం అందించేది. కానీ అవి త్వరగా పాడైపోయి పురుగు పట్టడంతో పిల్లలు, తల్లిదండ్రులు, విద్యాశాఖ ఆందోళన చెందేవారు. కానీ ఈ విద్యా సంవత్సరం మొదలు తో ప్రభుత్వం చిక్కిలను మార్పు చేసి వినూత్నంగా మిల్లెట్ రూపంలో సరికొత్త రకం చిక్కిలను విద్యార్థులకు అందిస్తోంది. తద్వారా విద్యార్థులు మిల్లెట్ చిక్కిలను ఎంతో ఆనందంతో స్వీకరిస్తున్నారు. వీటికి దాదాపు పురుగు పట్టే అవకాశం లేదు. విద్యార్థులకు ఈ మిల్లెట్ చికీలను సక్రమంగా అందించి వారి ఆరోగ్యానికి బాసటగా నిలవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

**విద్యాశాఖ అధికారులకు ప్రైవేటు పాఠశాలల పైనే మొగ్గు:**

మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో అరకొరక సౌకర్యాలు ఉన్నప్పటికీ వాటిపై దృష్టి సాధించకుండా సరైన అమలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ అధికారులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలలపై మొగ్గుచూపు తున్నారే తప్ప ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టకపోవడం, ఇక్కడ చదివే పిల్లలను గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేస్తే ఆమ్యామ్యాలు ఉంటాయన్న విమర్శలు ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం, కార్పొరేట్ యాజమాన్యులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ పాఠశాలలపై మండల విద్యాశాఖాధికారులు మొగ్గు చూపుతున్నాయి అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలే ముద్దు... ప్రైవేటు వద్దు... అన్న పెద్దల మాటను నిలుపుతారని ప్రజలు, విద్యా మేధావులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.








**మెరుగైన తనిఖీలు నిర్వహిస్తాం... పాఠ్యపుస్తకాలు త్వరలో అందిస్తాం....**

**గోపాల్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి, శ్రీ సత్య సాయి జిల్లా.**

నియోజకవర్గ వ్యాప్తంగా పాఠ్యపుస్తకాల పంపిణీ పాత రోల్ ప్రకారం ప్రతి పాఠశాలకు పంపిణీ చేశాము. దాదాపు 90 శాతం పుస్తకాలు విద్యార్థులకు అందించడమైంది. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఇండెంట్ పంపుతున్నాము. పుస్తకాలు వచ్చిన వెంటనే అందరికీ అందజేస్తాం. మనబడి... మన భవిష్యత్ కార్యక్రమాలు ఉండడంవల్ల పర్యవేక్షణకు ఇబ్బందులు తలెత్తాయి. విద్యాశాఖ కు సంబంధించిన అనేక పరిపాలన బాధ్యతలు ఉండడంతో ప్రతి పాఠశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించడం సాధ్యపడలేదు. అయితే మధ్యాహ్నం భోజన పథకం పై ప్రతి నెల ప్రభుత్వ నివేదికను తప్పనిసరిగా ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయం నుంచి ఆన్లైన్ ద్వారా ఏ పాఠశాలలను తనిఖీ చేయాలో సందేశాలు వస్తాయి. వాటి ప్రకారం సంబంధిత పాఠశాలలను పరిశీలించి నివేదికలు సమర్పిస్తున్నాం. ఇకపై క్షేత్రస్థాయి తనిఖీలు కూడా మరింత విస్తృతంగా నిర్వహించి, మధ్యాహ్నం భోజన పథకం నాణ్యత పై ప్రత్యేక దృష్టి సారిస్తాం. జూన్ మాసంలో చండీఘర్ రాష్ట్రం నుంచి చిక్కీలు రావడం ఆలస్యం అయినది. జూలై మాసం నుంచి మిల్లెట్ కొత్తగా చిక్కిలు ఇవ్వడం జరుగుతుంది. నాణ్యతగా పిల్లలకు రుచికరంగా ఉంటాయి.

**పుస్తకాలు పూర్తి స్థాయిలో అందలేదు.**

**బి కే ముత్యాలప్ప, ఏపీటీఎఫ్ స్టేట్ ఆడిట్ కన్వీనర్, శ్రీ సత్య సాయి జిల్లా.**

ప్రతి మండలాలలో దాదాపు పాఠ్యపుస్తకాలు అంతంత మాత్రమే అందాయి. కొత్తగా చేరిన విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, సర్వేపల్లి కిట్లు అందించలేక పోవడంతో విద్యార్థులలో కాసింత బాధలను వ్యక్తపరుస్తున్నారు. ఎఫ్ ఏ వన్ పరీక్షల కారణంగా కొంత ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల బాధలను అర్థం చేసుకొని విద్యాశాఖ అధికారులు ఇండెంట్ ప్రకారం త్వరగా పాఠ్యపుస్తకాలు అందజేయాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పాఠశాలలపై అధికారులు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు మెరుగైన, నాణ్యమైన భోజనం అందించేలా నిరంతర పర్యవేక్షణ జరిగేలా చూడాలి. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తు పథకాలు సమృద్ధిగా అమలు పరిస్తే మరింత విద్యాభివృద్ధి జరిగే అవకాశం ఉంటుంది.



# క్రీడా పోటీలకు సి.ఎస్.ఆర్ నిధులు అందజేత

**అనంతపురం, జూలై 13: అనంత జనశక్తి న్యూస్**

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్ షిప్ -2026 కోసం సిఎస్ఆర్ నిధులు కింద రాయదుర్గం నియోజకవర్గం డి. హీరేహాల్ కు సంబంధించిన బి ఐ ఓ పి స్టీల్స్ మరియు పవర్ ప్రవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి మంజు మోది తరపున రూ.1లక్షారూపాయలవిరాళాన్ని ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ ను కలిసి అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల తదితరులు పాల్గొన్నారు.



## కాశీ-ప్రయాగరాజ్-అయోధ్య యాత్ర ముగించుకొని వచ్చిన యాత్రికులకు ఘనస్వాగతం



**హిందూపురం, జూలై 13:అనంత జనశక్తి న్యూస్**

కాశీ, ప్రయాగరాజ్, అయోధ్య పుణ్యక్షేత్రాల యాత్రను విజయవంతంగా ముగించుకొని హిందూపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న యాత్రికులకు ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బి.వి. అరుణ్ కుమార్ రెడ్డి, జయనగర విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఉపాధ్యక్షురాలు పద్మా చిన్నపరెడ్డి యాత్రికులను పూలమాలలతో సాదరంగా ఆహ్వానించి అభినందించారు.సుమారు 80 మంది భక్తులు ఈ పుణ్యయాత్రలో పాల్గొనగా, యాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించినట్లు యాత్రికులు తెలిపారు. కాశీ విశ్వనాథ్, ప్రయాగరాజ్ త్రివేణి సంగమం, అయోధ్య శ్రీరామ జన్మభూమి వంటి పవిత్ర క్షేత్రాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దైవ దర్శనాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు.యాత్రికుల వసతి, భోజనాలు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తూ యాత్ర విజయవంతంగా పూర్తయ్యేలా బి.వి. అరుణ్ కుమార్ రెడ్డి, పద్మా చిన్నపరెడ్డి విశేష కృషి చేశారని భక్తులు కొనియాడారు. వారి సేవాభావం వల్ల యాత్ర ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల నడుమ ముగిసిందని తెలిపారు.ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ, యాత్రను విజయవంతంగా నిర్వహించి తమకు చిరస్మరణీయ ఆధ్యాత్మిక అనుభూతిని అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పుణ్యయాత్రలను మరింత మంది భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.హిందూపురం రైల్వే స్టేషన్‌లో యాత్రికులకు ఘన స్వాగతం పలికిన సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆ ఇద్దరే నా హీరోలు. మంచు ఫెర్రర్.



**శెట్టూరు జూలై 13. అనంత జనశక్తి న్యూస్.**

శెట్టూరు మండలం ముచ్చర్లపల్లి అంబేద్కర్ నగర్ నందు . భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు ఫాదర్ విగ్రహాలను గ్రామంలోని . జై బీమ్ యువత ఆధ్వర్యంలో విగ్రహాలు నెలకొల్పారు ఆ విగ్రహాల ఆవిష్కరణకు పేదల పాలిట పెన్నిధి అయిన ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మంచు ఫెర్రర్ ముఖ్య అతిథిగా విచ్చేసి విగ్రహాలను ఆవిష్కరించారు ఆవిష్కరణ తర్వాత అక్కడ ఏర్పాటుచేసిన భారీ సభను ఉద్దేశించి మాట్లాడుతూ. ప్రతి ఒక్కరికి వాళ్ళని ప్రభావితం చేసే మనుషులు ఉంటారని అది కాకుండా ప్రతి ఒకరికి తమకు ఇష్టమైన అభిమానించే నాయకుడు హీరో ఉంటారని తెలియజేశారు కానీ తనుకు తెలిసిన ఇద్దరు హీరోలు మాత్రమే తనకు తెలుసని ఆ ఇద్దరూ ఎవరో కాదు ఒకరు భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒకరు ఇంకొకరు తన తండ్రి తెలియజేశారు ఎందుకంటే ఆ ఇద్దరి నుండి ఎంతో మంది పేద బతుకులకు జీవిత వెలుగుల నింపిన గొప్ప వ్యక్తులని తెలియజేశారు ఆ వ్యక్తులు చూపించిన దారిలో తమ అందరమూ నడవాలని నడిచి వ్యక్తులు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. పేదరిక నుండి గట్టెక్కాలంటే ఏకైక మార్గం ఏకైక లక్ష్యం చదువు అని ప్రతి ఒక్కరూ చదువుని నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత చదువులు చదివి తమ కుటుంబానికి చేదోడుగా నిలవాలని ఈ సందర్భంగా యువతనుదేశించి విషయాలను తెలియజేశారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విగ్రహావిష్కరణకు విచ్చేసిన మంచు గ్రామ యువకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున ఫాదర్ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు మద్యం రేట్లను తగ్గించాలి :వైఎస్ఆర్సిపి నాయకులు.



**శెట్టూరు జూలై 13. అనంత జనశక్తి న్యూస్.**

మండల వ్యాప్తంగా ప్రతి ఒక్క గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో మద్యాన్ని ఇష్టమొచ్చినట్లు క్వార్టర్పై 30 40 50 రూపాయల వరకు అధిక మొత్తంలో విక్రయిస్తున్నారని. బెల్ట్ షాపులు లేకుండా చూస్తామని మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం కనీసం బెల్టు షాపుల్లో పైన ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని అలా చర్యలు చేపట్టి సామాన్య ప్రజల నుండి అధిక మొత్తంలో వసూలు చేస్తున్న డబ్బును ఆదా చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామంలో బెల్ట్ షాపులు ఎక్కువై గ్రామంలోని యువత మరియు ప్రజలు మద్యానికి బానిసలై హత్యలు కూడా జరిగి స్థాయికి కారణం ఈ మధ్యనైనా అని తెలియజేశారు మొన్నటికి మొన్న మంగంపల్లి గ్రామంలో తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కట్టుకున్న భార్యని కడ తీర్చిన సంగతి మర్చిపోకూడదని ఇలాంటి విషయాలు మళ్లీ పునరావతం కాకుండా ఉండాలంటే బెల్టు షాపులోని పూర్తిగా తీసివేయాలని . కనీసం బెల్ట్ షాపుల్లో కూడా అధిక మొత్తానికి మధ్య విక్రయించకుండా ఎమ్మార్పీ ధరలకే విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని వైఎస్ఆర్సిపి నాయకులు తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం స్వీకరించిన తాసిల్దార్ పై అధికారులకు విషయాన్ని తెలియజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమనాథ్ రెడ్డి. వైస్ ఎంపీపీ. వడ్డే ముత్యాలు. చెవులకిష్టప్ప. వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు . సర్పంచ్ విరుపాక్షి. మాజీ ఎంపిటిసి ప్రకాష్.నాయకులు హరినాథ్ రెడ్డి. కంబాలపల్లి శ్రీనివాసులు. బోయ తిప్పేస్వామి టైలర్ వన్నురస్వామి. బాబురావు గౌరయ్య.
మిద్దె సుధాకర్. మీసేవ బాబు. నాగేంద్ర కాసిం తంజీద్ భాష నాగరాజు విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు

## సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- శ్రీ సత్యసాయి జిల్లాలో రాష్ట్ర సమాచార కమిషనర్ సుడిగాలి పర్యటన
- హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరంలో ఆకస్మిక తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన పలువురు పిఐఓలకు షోకాజ్ నోటీసులు జారీ
- 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్ర సమాచార కమిషనర్ జి. ఆదెన్న

**పుట్టపర్తి, జూలై 13:అనంత జనశక్తి న్యూస్**



ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం (RTI) ఒక కీలక సాధనమని, దీని అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ జి. ఆదెన్న హెచ్చరించారు.సోమవారం ఆయన శ్రీ సత్యసాయి జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఆకస్మిక సుడిగాలి పర్యటనలు నిర్వహించి, ఆర్టీఐ దరఖాస్తుల స్వీకరణ, సకాలంలో వాటి పరిష్కారం మరియు పెండింగ్ వివరాలను తనిఖీ చేశారు.తన పర్యటనలో భాగంగా కమిషనర్ తొలుత హిందూపురం నగరంలోని మున్సిపల్ కార్యాలయం, ఎంజీఎం ఉన్నత పాఠశాల, ఉప రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించారు. అనంతరం పుట్టపర్తిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం, డ్వామా కార్యాలయం, ట్రెజరీ కార్యాలయాలతో పాటు పెడబల్లి, ధర్మవరం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్లు 18(3), 18(4), మరియు 19(8)(ఎ) కింద ఈ తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.సమాచార హక్కు చట్టం2005 లోని సెక్షన్ 4(1)(b) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం పాటించాల్సిన శాసనబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించడంలో ప్రాథమికంగా వైఫల్యం చెందారు.కార్యాలయాల్లో ప్రజలకు స్పష్టతనిచ్చే 'సిటిజన్ చార్టర్' (పౌర చార్టర్)బోర్డులను ప్రదర్శించలేదు.దరఖాస్తుదారులకు అవసరమైన ప్రజా సమాచార అధికారి (PIO), మొదటి అప్పిలేట్ అధికారి (FAA) ల పేర్లు, వారి సంప్రదింపు వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేయలేదు. పలువురు పిఐఓలకు ఆర్టీఐ చట్టంపై కనీస అవగాహన లోపించినట్లు కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.
పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ..
శాసనబద్ధమైన బాధ్యతల నిర్వహణలో విఫలమైనందుకు గాను సమాచార హక్కు చట్టం సెక్షన్ 19(8)(ఎ) కింద కమిషనర్ ఆయా కార్యాలయాల ప్రజా సమాచార అధికారులకు (PIOs) ఘాటుగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు.
నోటీసులు అందుకున్న కార్యాలయాల వివరాలు..

1. హిందూపురం మున్సిపల్ కార్యాలయం
2. హిందూపురం ఎంజీఎం (MGM) ఉన్నత పాఠశాల
3. హిందూపురం ఉప రిజిస్ట్రార్ కార్యాలయం
4. పెడబల్లి ఉన్నత పాఠశాల
5. పుట్టపర్తి డిఎం&హెచ్ఓ (DM&HO) కార్యాలయం
6. పుట్టపర్తి ఐసిడిఎస్ (ICDS) కార్యాలయం
7. పుట్టపర్తి డ్వామా (DWMA) కార్యాలయం
8. పుట్టపర్తి ట్రెజరీ కార్యాలయం
9. ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ఈ షోకాజ్ నోటీసులు అందిన 15 రోజులలోపు సంబంధిత అధికారులు కమిషన్‌కు సంతృప్తికరమైన వివరణ సమర్పించాలని రాష్ట్ర సమాచార కమిషనర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా వివరణ ఇవ్వడంలో విఫలమైతే, తదుపరి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రథమ అప్పీల్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు (PIO), సహాయ ప్రజా సమాచార అధికారులు (APIO) చట్టంలోని నిబంధనలపై, దరఖాస్తుల పరిష్కారంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేస్తూ ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా విద్యార్థినుల భద్రతలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం

- వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్

**అనంతపురం జూలై 13, అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో మహిళా వైద్య విద్యార్థినులపై వేధింపులు జరిగాయని దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అడిషనల్ సూపరింటెండెంట్ నాగ భూషణం గారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.
పత్రికల్లో ప్రచురితమైన ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని, బాధిత విద్యార్థినులకు పూర్తి భద్రత కల్పించాలని, విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల, ఆసుపత్రి, హాస్టళ్లలో మహిళల భద్రతను మరింత బలోపేతం చేసి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా నమ్మకం కలిగించే చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన విమర్శించారు.మహిళలు, ముఖ్యంగా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు, భయాందోళనలు లేకుండా విద్యను అభ్యసించే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పత్రికల్లో వెలువడిన ఆరోపణలు నిజమైతే అవి అత్యంత తీవ్రమైనవని, అందువల్ల ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం మహిళల రక్షణ, విద్యాసంస్థల్లో భద్రత విషయంలో ప్రకటిస్తున్న హామీలకు భిన్నంగా నేలస్థాయిలో పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆయన విమర్శించారు.
మహిళా విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి విద్యాసంస్థలో సమర్థవంతమైన భద్రతా వ్యవస్థ, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షులు కైలాష్ నగర ప్రధాన కార్యదర్శులు శేఖర్, సాయి చరణ్,హరీష్, బబ్లు, చరణ్, రఫీ, ఫయాజ్,కార్తికేయ తదితరులు పాల్గొన్నారు

## గురుకుల పాఠశాలలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే అమిలినేని

- జియాలాజిస్ట్ ను పంపి వెంటనే బోరు వేయించేలా ఏర్పాటు..
- తక్షణం స్పందించి స్వంతంగా ట్యాంకర్ల ద్వారా నీటి వసతి కల్పించిన ఎమ్మెల్యే అమిలినేని

**కళ్యాణదుర్గం జూలై 13, అనంత జనశక్తి న్యూస్**



గత రెండు రోజులుగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్న కంబదూరు మండలం తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఉదయమే స్థానిక, మండల నాయకులను పంపి పరిస్థితి అడిగి తెలుసుకోవడమే కాకుండా తక్షణం స్పందించి ట్యాంకర్లు పంపి నీటిని అందించడం జరిగింది.బోరు వేయించే వరకు నీటిని ట్యాంకర్ల ద్వారా అందించామని స్కూల్ కమిటీ చైర్మన్ కు చెప్పడం జరిగింది. కేవలం అక్కడితోనే ఆగకుండా శాశ్వత పరిష్కారం చూపేల జియాలాజిస్ట్ ను పంపి ఒకటి కాకుండా మూడు లేదా నాలుగు బోరు పాయింట్లు పెట్టించాలని, పాయింట్ పెట్టిన వెంటనే బోరు వేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది..విద్యార్థులకు ముందు ముందు నీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని తెలియజేశారు..

## ప్రభుత్వం స్పందించి పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

- జూలై 14 ర్యాలీని విజయవంతం చేయాలి.
- ఏపీటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు సానే. రవీంద్ర రెడ్డి

**ధర్మవరం, జూలై 13, అనంత జనశక్తి న్యూస్:**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు సానే. రవీంద్ర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు ధర్మవరం పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపి, అంజి నాయక్ మరియు కార్యవర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.... పిఆర్సి, పెండింగ్ డిఏలు, సిపిఎస్ రద్దు, ఆర్థిక బకాయిలు చెల్లించకుండా ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పైగా టెట్ పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురి చేస్తుందని అన్నారు. సీనియర్ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.... మునిసిపల్ ఉపాధ్యాయులకు సిసిఎస్ లో ఉన్న బకాయిలను వారి పీఎఫ్ ఖాతాలో జమ చేయాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ, పిడి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, ఉపాధ్యా యులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. డిమాండ్ల సాధన కోసం జూలై 14న జిల్లా కేంద్రంలో ర్యాలీ..... ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య ఆధ్వర్యంలో జూలై 14న నిర్వహించనున్న ర్యాలీలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సానే రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాలీ జులై 14న జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు పుట్టపర్తి గణేష్ సర్కిల్ నుండి నిర్వహిస్తున్న ర్యాలీ... పికెటింగ్ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. 18 రకాల డిమాండ్ సాధన కోసం ఫ్యాప్టో ఉద్యమాన్ని విజయవంతం
చేయాలని కోరారు.

# "రాయలసీమకు జీవనాడిగా ఎత్తిపోతల పథకం..

**- పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై నెల్లూరులో వైఎస్సార్‌సీపీ రౌండ్ టేబుల్ సమావేశం"**

**నెల్లూరు, జూలై 13,అనంత జనశక్తి న్యూస్**



గ్రేటర్ రాయలసీమ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులు, రాయలసీమ ఎత్తిపోతల పథకం అమలు తదితర కీలక అంశాలపై నెల్లూరులోని డాక్టర్ ఉత్తమ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన "రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ కమిటీ" రౌండ్ టేబుల్ సమావేశం రాజకీయ, సాగునీటి వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హాజరై రాయలసీమ ప్రాంత అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రజల దీర్ఘకాలిక సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరాన్ని వారు నొక్కిచెప్పారు.కార్యక్రమంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ కమిటీ కన్వీనర్ సాకే శైలజనాథ్, సమన్వయకర్తలు రంగయ్య, విశ్వేశ్వర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అనంతపురం జిల్లా టాస్క్ ఫోర్స్ కోఆర్డినేటర్ నార్పల సత్యనారాయణ రెడ్డి, రాయలసీమ జిల్లాలకు చెందిన శాసనసభ్యులు, సమన్వయకర్తలు, టాస్క్ ఫోర్స్ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.రాయలసీమలో సాగునీటి సమస్యల పరిష్కారం, పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి, ఎత్తిపోతల పథకం అమలు వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

# మహిళా ఆరోగ్యానికి బాసటగా నిలిచిన మంత్రి సత్యన్న



**- సీఎంఆర్ఎఫ్ వైద్య సహాయం కింద రెండు లక్షలు అందజేత.**

**- -మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు.**

**ధర్మవరం జులై 13, అనంత జనశక్తి న్యూస్:**

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు.

శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం రామస్వామి తండాకు చెందిన శ్రీమతి పెద్దిరెడ్డి సుధమ్మ, తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వైద్యుల నిర్ధారణ ప్రకారం ఆమె గుండె, ఊపిరితిత్తుల పనితీరుతో పాటు రక్తప్రసరణకు సంబంధించిన తీవ్రమైన సమస్యలతో బాధపడుతుండగా, ప్రత్యేక వైద్య చికిత్సతో పాటు టి ఎం ఎం ఎస్ థెరపీ దీర్ఘకాలికంగా అవసరమయ్యే మందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు ఆమె చికిత్సకు సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తూ ఎస్టిమేషన్ సర్టిఫికేట్ జారీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో చికిత్స కొనసాగించడం భారంగా మారింది. ఈ విషయం మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రి సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేసింది అని తెలిపారు. ఈ నిధుల ద్వారా సుధమ్మ కి అవసరమైన థెరపీ, వైద్య చికిత్స ,అవసరమైన మందులు అందుబాటులోకి రానున్నాయి అని తెలిపారు. ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు బాధిత కుటుంబ సభ్యులకు, మంత్రి సత్యకుమార్ యాదవ్ తరపున సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం పేదల వైద్యానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హరీష్ బాబు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సుధమ్మ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితిలో తమకు అండగా నిలిచి, త్వరితగతిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలలో రక్తదాన కార్యక్రమం

**రాప్తాడు జులై 13 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలం గొల్లపల్లి మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల నందు మాంటిస్సోరి వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మెగా వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుంచడమే లక్ష్యంగా మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల నిర్వహిస్తున్న ఒక గొప్ప కార్యక్రమము .మన చుట్టూ ఉన్న సాటి మనుషులకు సేవ చేయాలనేది కళ్యాణమ్మ ఆకాంక్ష ఆ కోరికను నిజం చేస్తూ, మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల ఎండి ."కృష్ణ భరత్ " కరస్పాండ్ "కృష్ణ సమీరా " వైద్య శిబిరాలను ,రక్త దాన శిబిరాలను ప్రారంభించారు.






# వేరుశెనగ కాయలు పంపిణీ..

**గాండ్లపెంట, జూలై,13, అనంత జనశక్తి న్యూస్:**

మండలం రైతులు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు అతియా ఫార్మర్స్ కంపెనీ తోడ్పాటు అందిస్తున్నట్లు సిఈఓ వెంకటేష్ నాయక్ సిసిఓ బాలకృష్ణ రెడ్డి తెలిపారు. అతియా ఫార్మర్స్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత విత్తన వేరుశెనగ కాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఈఓ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 10కె ఎఫ్ పి ఓ లలో బాగంగా ఎస్ ఎఫ్ ఏ సి సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా తమ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. అందులో భాగంగా రైతుల అభివృద్ధి సంక్షేమం దిశగా ముందుకు సాగేందుకు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు సబ్సిడీ కి అందజేస్తున్నామని చెప్పారు ఇప్పటి వరకు దాన టర్పాల్ పట్లు , టమోటా కట్టెలుసజ్జలు జొన్నలు పవర్ స్ప్రేయర్లుపవర్ వీడర్లు బ్యాటరీ స్ప్రేయర్లు జేసిబి పనులు చేయించామన్నారు ఈ కార్యక్రంలో మండల వ్యవసాయ అధికారి షాదాబ్, సిఈఓ వెంకటేష్ నాయక్, సిసిఓ బాలకృష్ణ రెడ్డి, సంస్థ సిబ్బంది జయరాములు, రోజా,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాల సాధన కొరకే అదనపు స్టడీ అవర్స్.

**- ప్రారంభమైన పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్..**

**- హెడ్మాస్టర్ పూల పద్మావతి.**

**ధర్మవరం జులై 13, అనంత జనశక్తి న్యూస్:**

విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 202627 పదవ తరగతి విద్యార్థులు మంచి ప్రతిభతో ముందుకు వెళుతూ చక్కటి ఫలితాలను సాధించేందుకు జూలై 13 వ తేదీ నుండి పరీక్షలు ముగిసే వరకు స్టడీ అవర్స్ ను కొత్తపేటలోని ఎస్ పి సి ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించడం జరిగిందని హెడ్మాస్టర్ పూల పద్మావతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ఈ స్టడీ అవర్స్ సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీంతో తొలి రోజున తెలుగు స్టడీ అవర్స్ ను ఆదినారాయణ చేత ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ స్టడీ అవర్స్ విషయాన్ని తల్లిదండ్రుల ద్వారా విద్యార్థులకు తెలియజేయడం జరిగిందని తెలిపారు. మా ఉపాధ్యాయుల కృషితో పదవ తరగతి పరీక్షా ఫలితాలను మంచి రిజల్ట్ గా తెస్తామని వారు భరోసాగా తెలిపారు.



# జెడ్పీలో ఇద్దరికి ఏఓలుగా ఉద్యోగోన్నతి

**అనంతపురం జూలై 13, అనంత జనశక్తి న్యూస్**

జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం కింద పని చేస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారిలో జెడ్పీ ఏ సెక్షన్‌లో పని చేసే కె.అరుణకుమారి, అనంతపురంలో పీఆర్ సబ్ డివిజన్ 2 లో డిప్యూటీషన్ పై కొనసాగుతున్న వీ.ఎన్.ఎస్. మాధవికి పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు వారికి ఉద్యోగోన్నతి కల్పించి, పోస్టింగ్స్ కేటాయించారు. ఈ మేరకు ఉత్తర్వులను ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ విజయలక్ష్మి సోమవారం అందజేశారు. వారినుద్దేశించి చైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. ఉద్యోగోన్నతి పొందిన గారికి తొలుత శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు మరింత భాధ్యతగా పని చేయాలని కోరారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తూ, వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని దిశా నిర్దేశం చేశారు.



# సర్ సర్వేను పరిశీలించిన నియోజకవర్గ పరిశీలకుడు

**నల్లచెరువు జులై 13 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని అల్లుగుండు పంచాయతీలో బూత్ నంబర్ 209 లో కదిరి నియోజకవర్గం శాసనసభ్యులు కందుకుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు కదిరి నియోజకవర్గం పరిశీలకులు చెంచయ్య నాయుడు మండల మరియు కన్వీనర్ రాజశేఖర్ కలిసి సర్ కార్యక్రమాన్ని పరిశీలించి మీకు ఇచ్చిన ఎన్మిరేషన్ ఫామ్ లను త్వరగా బియల్ఓ లకు అందజేసి ఆన్లైన్ చేయించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బియల్ఓ లు మరియు బియల్ఏ లు తెలుగుదేశం పార్టీ నాయకులు ఓటర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శివాలయాలలో ప్రత్యేక పూజలు

**యాడికి, జూలై 13, అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలోని భైరవ కొండపై ఉన్న భైరవ లింగేశ్వర శివాలయంలోను, అయ్యప్ప స్వామి దేవాలయంలో ను ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలోను, భోగలింగేశ్వర స్వామి దేవాలయంలోను, ఉన్నత పాఠశాల వెనుక ఉన్నశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోను, కోనలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలోను, పలు శివాలయాలలోను సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరించారు. అర్చనలు చేసి, హారతులను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివున్ని దర్శించి, టెంకాయలను సమర్పించారు.కరుణించవయ్యా.........భోలా శంకర అని వేడుకోన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు, భక్తులు పాల్గోన్నారు.

# అర్ధనగ్నంగా ఆందోళన చేపట్టిన ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి



**యాడికి, జూలై 13,**

**అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న ఎంపిడిఓ కార్యాలయంలో ఎదుట సోమవారం నిట్టూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి అర్ధనగ్నంగా ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా నిట్టూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే కూలీలకు ఉపాధి పనులు కల్పించకుండా ఎంపీడీవో, ఏపీఓ లు తనను డీ గ్రేడ్ లో పడేలా చేసి , విధుల నుంచి తప్పించేలా చేశారని తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి తన కుటుంబాన్ని రోడ్డున పడేలా చేశారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు, దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# మార్ల మధురాజు కు ఘన సన్మానం



**యాడికి, జూలై 13, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అనంతపురం తెదేపా బీసి సెల్ అధికార ప్రతినిధి మార్ల మధురాజు కు తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, తెదేపా నాయకులు ఘనంగా సన్మానించారు. నెల రోజులు నుండి సర్ కార్యక్రమం ను 100% పూర్తి చేసిన సందర్భంగా తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, తెదేపా నాయకులు రుద్రమ నాయుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పరిమి శ్రీహరి, రూపునేని రాజశేఖర్, జె ఎం మహమ్మద్ రఫీ లు శాలువా కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 2002 లో ఇలా ఓటు వెరిఫికేషన్ జరగడం జరిగిందని, వాటి ఆధారంగా ఇప్పుడు మరి ఈ వెరిఫికేషన్ జరగడం జరుగుతుందని తెలిపారు . ప్రభుత్వాదేశాల మేరకు ... ఎమ్మెల్యే జేసీ అస్విత్ రెడ్డి సూచనల మేరకు బీఇఎల్ఓ ని వెంటపెట్టుకొని మీకు ఇచ్చినటువంటి తొమ్మిది వందల నలభై ఏడు ఓట్లు పరిశీలించారని తెలిపారు .పూర్తి అయినవి 787,చనిపోయిన వారివి 108,డబల్ ఓట్లు 35,షిఫ్టింగ్ ఓట్లు 16 ఉన్నాయని తెలిపారు. పలువురు అనంతపురం తెదేపా బీసి సెల్ అధికార ప్రతినిధి మార్ల మధురాజు ను అభినందించారు.

# కుష్టి వ్యాధి పై అవగాహన

**యాడికి , జూలై 13, అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని కోనుఉప్పలపాడు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కుష్టి వ్యాధి పైన విద్యార్థులకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పి రామచంద్ర మాట్లాడుతూ కుష్టి వ్యాధి లక్షణాలు ప్రధానంగా చర్మంకు నరాలకు వ్యాప్తి చెందుతుందని, ఎరుపు రంగు, రాగి వర్ణము చర్మం పైన దద్దులు బూడిపలు , ముఖం పైన నూనె పోసినట్లు శరీరము కలిగి ఉంటారని తెలిపారు. కాలు చేతులు వంకర్ లోకి ఉండటము, అరికాలు అరి పాదాలు చెప్పులు వేసుకోవటం జారిపోవటము నరాలు వాపు రావటము మొదలగు లక్షణాలు ఉంటాయని తెలిపారు . విద్యార్థులకు ఎవరికైనా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాడికి వచ్చి డాక్టర్ దగ్గర పరీక్షల చేపించుకొని మందులు తీసుకోవాలని తెలిపారు.స్పర్శ లేని మచ్చల గురించి వివరించి పరీక్ష చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్న పెద్దన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం
14.07.2026
ANDHRA PRADESH NEWS ఆంధ్రప్రదేశ్ న్యూస్

# భైరవలింగేశ్వర ఆలయం లో మహాశైవాక్షయోగం పూజలు



**యాడికి, జూలై 13, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలోని భైరవ కొండ పైన ఉన్న భైరవ లింగేశ్వర స్వామి దేవాలయం లో సోమవారం మహాశైవాక్షయోగం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భైరవ లింగేశ్వర స్వామి కి,విజయాంబిక అమ్మకు ఉదయం అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు.వందేళ్లకోకసారి మహాశైవాక్షయోగం ఏర్పడుతుందని, శివాధన చేయడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయని, సుఖశాంతులు ఏర్పడుతాయని పురోహితులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భైరవ లింగేశ్వర స్వామి ని దర్శించి, టెంకాయలను కానుకలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తొలగిన మురుగు



**- గత పాలకుల నిర్లక్ష్యంతో అధ్వాన్న స్థితిలో ఆసుపత్రి ప్రాంగణం**

**కుందుర్పి. జూలై 13. అనంత జనశక్తి న్యూస్**

కుందుర్పి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి ప్రధాన రహదారిలో వచ్చే మురుగు నీరు మొత్తం ఆసుపత్రి ప్రాంగణంలోకి వెళ్లి పందులకు నిలయంగా మారిపోయి ఉండేది.కుందుర్పి పర్యటన కోసం వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడి పరిస్థితి చూసి ఎందుకు ఇలా ఇంత అధ్వానంగా ఉందో అడిగి తెలుసుకుని అక్కడ పరిస్థితి మారాలంటే ఏమి చేయాలో స్థానిక నాయకులతో మాట్లాడి తెలుసుకున్నారు..ముందు ప్రధాన రహదారి నుంచి మురుగు ఆసుపత్రి ప్రాంగణంలో రాకుండా డ్రైనేజి ఏర్పాటు చేశారు..అనంతరం ఆసుపత్రి ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించి ఏకంగా 150 టిప్పర్లు మట్టిని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన స్వంత నిధులతో తోలించి చదును చేసి నేడు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు..దీంతో కుందుర్పి మండలంలోని ఆసుపత్రికి వచ్చే రోగులే కాకుండా మండల ప్రజలు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వంక బ్రిడ్జి లోకి దూసుకెళ్లిన కారు



**యాడికి, జూలై 13, అనంత జనశక్తి న్యూస్:**

మండల పరిధిలోని వేములపాడు కొట్టాలపల్లి సమీపంలో సోమవారం వంక బ్రిడ్జి లోకి కారు దూసుకెళ్లింది.వంక బ్రిడ్జి వద్దకు రాగానే కారు అదుపు తప్పి,వంకలోకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో రైల్వే కోడూరు కి చెందిన అవినాష్ కి స్వల్ప గాయాలు అయ్యాయి. గమనించిన వాహనదారులు అవినాష్ ను ప్రభుత్వానికి తరలించారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై 98 శాతం పూర్తి.



**- ఎమ్మార్వో. దేవరాజ్.**

**ధర్మవరం జులై 13, అనంత జనశక్తి న్యూస్:**

**మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో గల గ్రామాలలో మొత్తం ఓటర్లు 34,848 ఉన్నారని, ఎస్ ఐ ఆర్ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూలై 13 వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు 32,652 ఎస్ ఐ ఆర్ పూర్తి చేయడం జరిగిందని. దీంతో 98 శాతం నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకనూ 705 ఓటర్లను సోమవారం రాత్రి లోపల పూర్తి చేయగలమని వారు తెలిపారు. ఎస్ ఐ ఆర్ నివేదికలను జిల్లా కలెక్టర్ కు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో సురేష్ బాబు పాల్గొన్నారు.**

# నూతిమడుగు బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే అమిలినేని స్వంత నిధులతో మరమ్మత్తులు..

**- వర్షా కాలం దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి పైపుల వద్ద ముళ్ల చెట్లు తొలగింపు, కాంక్రీట్ బెడ్డింగ్ పనులు**

**కంబదూరు జూలై 13, అనంత జనశక్తి న్యూస్**

కంబదూరు మండలం నూతిమడుగు వద్ద పెన్నా నదిపై ఉన్న వంతెన గతంలో వర్షాలకు కొట్టుకుపోతే అక్కడ అనేక గ్రామాల ప్రజలకు ఉన్న దారి కావడంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు వాహనాలు వెళ్లే విధంగా బ్రిడ్జి వద్ద తాత్కాలిక నిర్మాణం చేయించారు.. నూతన బ్రిడ్జి మంజూరు అయ్యే వరకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన స్వంత నిధులతో అక్కడ బ్రిడ్జి వద్ద నీరు పారేందుకు వీలుగా ఇరు వైపుల అడ్డుగా ఉన్న కంప చెట్లు, మట్టి, రాళ్ళను జేసీబీ ద్వారా తొలగించడమె కాకుండా రెండు వైపుల పైపులు కొట్టుకు పోకుండా కాంక్రీట్ బెడ్డింగ్ నిర్మాణం కూడా చేపట్టారు..దీంతో



పేరూరు డ్యామ్ నుంచి నీళ్లు వచ్చిన బ్రిడ్జి డ్యామేజి కాకుండా ఉండేలా చర్యలు చేపట్టారు..నూతిమడుగు, అటు వైపు ఉన్న అనేక గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు లేకుండా ప్రయానించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు..

# మత్స్యకారుల కన్నీళ్లపై రాజకీయాలు మానుకో జగన్



**- నష్టపరిహారం ఇవ్వలేని జగన్‌కు పరామర్శ చేసే అర్హత లేదు: మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి, జులై 13:అనంత జనశక్తి న్యూస్**

అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు అందాల్సిన పరిహారాలను సైతం పెండింగ్‌లో పెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, నేడు విశాఖకు వచ్చి పరామర్శ పేరుతో రాజకీయాలు చేయడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల కన్నీళ్లు కనిపించని జగన్‌కు, ఇప్పుడు మాత్రం అకస్మాత్తుగా సానుభూతి గుర్తుకు వచ్చిందా అని మంత్రి ప్రశ్నించారు. ఆనాడు నష్ట పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగిన బాధిత కుటుంబాలను పట్టించుకోని వారు, ఈరోజు పరామర్శ పేరుతో వస్తే ఆ కుటుంబాలు ఎలా నమ్ముతాయని నిలదీశారు.ఐదేళ్లపాటు అవకాశం ఉన్నప్పటికీ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించకుండా, సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం, ఇప్పుడు వారి కన్నీళ్లపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మంత్రి అన్నారు. నష్టపరిహారాలను పెండింగ్‌లో ఉంచిన వారు ఇప్పుడు బాధితులను పరామర్శిస్తే అది నిజమైన మానవత్వమా, లేక రాజకీయ ప్రదర్శనా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లకు సంబంధించిన రూ.3.15 కోట్లను 2024 జూలై 8న విడుదల చేశామని, అలాగే రూ.9.90 కోట్ల డీజిల్ (ఆయిల్) సబ్సిడీ బకాయిలను 2024 జూన్‌లోనే విడుదల చేసి మత్స్యకారులకు అందించామని తెలిపారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం జోన్-నాన్ జోన్ పేరుతో వేలాది మంది మత్స్యకారులను అన్యాయానికి గురి చేసిందన్నారు. 201819లో 52,946 మందికి విద్యుత్ సబ్సిడీ అందగా, వైసీపీ పాలనలో 202324 నాటికి అది 47,091 కలెక్షన్లకు పడిపోయిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జోన్-నాన్ జోన్ అనే వివక్షను పూర్తిగా తొలగించి 54,033 కలెక్షన్లు పునరుద్ధరించడంతో పాటు, 2026లో మరో 12,500 కొత్త కలెక్షన్లు మంజూరు చేసి ప్రస్తుతం మొత్తం 62,181 సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లు కల్పించామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.1,150 కోట్ల మేర సబ్సిడీ భారం భరిస్తోందని చెప్పారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారులకు అందించే భృతిని కూడా కూటమి ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిందని తెలిపారు. 202324లో 1,16,613 కుటుంబాలకు ప్రయోజనం అందగా, 202627లో 1,28,388 మత్స్యకార కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున భృతి అందించామని వెల్లడించారు.వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణగా పరిహారాల చెల్లింపుల గణాంకాలను మంత్రి ప్రస్తావించారు. 202223లో 74 మరణాలు నమోదైనా కేవలం 31 అర్హులైన క్లెయిమ్‌లకే రూ.3.10 కోట్లు విడుదల చేశారని, 202324లో 45 మరణాలు నమోదైనా కేవలం నాలుగు క్లెయిమ్‌లను మాత్రమే పరిష్కరించి రూ.40 లక్షలు చెల్లించారని తెలిపారు. అప్పుడు న్యాయం చేయని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు... ఇప్పుడు అండగా ఉంటానంటే ఆ మాటలకు ఎంత విలువ ఉంటుంది? ఓదార్పు కంటే ముందు బాధితులకు న్యాయం చేసిన చరిత్ర చూపించాలి. అదే ప్రజలు అడిగే మొదటి ప్రశ్న అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల కోసం చేయాల్సిన పని చేయని జగన్, కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేసి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన తర్వాత విశాఖకు వచ్చి మొసలి కన్నీళ్లు కార్చడం నిజమైన సానుభూతి కాదని, అది కేవలం రాజకీయ నాటకమేనని మత్స్యకారులే ప్రశ్నిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మత్స్యకారుల విశ్వాసం మాటలతో కాదు.చేతలతోనే సంపాదించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# విద్యార్థినులకు రక్షణగా 'పోక్సో', 'సైబర్' చట్టాలపై చైతన్యం

**- జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన సదస్సులు**
**- నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు పిలుపు**

**అనంతపురం క్రైం జూలై 13,అనంత జనశక్తి న్యూస్**

మహిళల భద్రత, బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (KGBV) 'మహిళలపై జరుగుతున్న నేరాలు', 'పోక్సో (POCSO) చట్టం', 'సైబర్ మోసాలు' అనే అంశాలపై విద్యార్థినులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుల్లో పోలీసు అధికారులు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా మైనర్లపై జరిగే లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టంలోని కఠిన నిబంధనలను, అలాగే ప్రస్తుత డిజిటల్



యుగంలో యువతను వేధిస్తున్న సైబర్ నేరాల ముప్పును విద్యార్థులకు వివరించారు. సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, లోభాలు, మోసపూరిత లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**రహస్యంగా ఉంచబడుతుంది..**

విద్యార్థినులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమకు ఎదురయ్యే వేధింపులపై తక్షణమే స్పందించాలి. ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండి, తమ దృష్టికి వచ్చిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలనైనా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని ఆయా పోలీసులు కోరారు

# పీజీఆర్ఎస్‌లో 109 ఫిర్యాదులు స్వీకరణ



- బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అదనపు

**ఎస్పీల ఆదేశాలు**

**అనంతపురం, జూలై 13 :అనంత జనశక్తి న్యూస్**

జిల్లా ప్రజల సమస్యలను చట్టపరిధిలో వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. నాగభూషణం, ఎస్. మహబూబ్ బాషాలు 109 ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారుల సమస్యలను అదనపు ఎస్పీలు ఓపికగా విని, వాటి తీవ్రతను బట్టి వెంటనే స్పందించారు. అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు మాట్లాడుతూ, ప్రతి పిటిషనర్‌కు న్యాయం జరిగేలా చూడటం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి అధికారులు మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాలని, బాధితులను ఇబ్బందులకు గురిచేయకుండా సమయపాలన పాటించాలని సూచించారు.పీజీఆర్ఎస్ కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సౌకర్యార్థం జిల్లా పోలీసు శాఖ, ఇస్కాన్ సంస్థ సహకారంతో భోజన వసతి కల్పించింది. కార్యక్రమానికి హాజరైన బాధితులు, వారి సహాయకులకు భోజన సదుపాయాలను పోలీసు అధికారులు పర్యవేక్షించారు.పోలీసుల స్పందన,బాధ్యతాయుతమైన పనితీరు పట్ల అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానంకు 10,016 విరాళం..

**నల్లచెరువు జులై 13 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు జెండా వేపమాను సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శావడేశ్వరి దేవి అమ్మవారి దేవాలయంకు గాను మగ్గాల కోటర్స్ లో నివాసం ఉంటున్న చౌడపు ఈశ్వరయ్య 10,016 రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలు ఇంకా ఎవరైనా ఉంటే ఆలయ నిర్మాణం కొరకు ముందుకొచ్చి సహకరించాలని కోరారు.



# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**- జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్**

**చిలమత్తూరు/లేపాక్షి జూలై 13:అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ సోమవారం చిలమత్తూరు, లేపాక్షి తహసిల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సహాయ ఓటర్ల నమోదు అధికారులు (AEROs), ఎలక్షన్ సూపర్ వైజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల నాణ్యతను జేసీ స్వయంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక తహసిల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం

- మంత్రులు సవిత, బాలవీరాంజనేయ స్వామి
- బడుగు, బలహీన వర్గాల విద్యకు అధిక ప్రాధాన్యం
- ఇకపై హాస్టళ్లకు బదులు గురుకులాలు ఏర్పాటు : మంత్రి సవిత
- త్వరలో కొత్త పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు
- ఏ ఎన్నికల్లోనైనా కూటమిదే విజయం తథ్యమన్న మంత్రి సవిత
- ఎస్సీ విద్యార్థులకు 3 ఎక్స్ లెన్స్ సెంటర్ల ఏర్పాటు : మంత్రి బాలవీరాంజనేయ స్వామి
- రూ.45 కోట్లతో టంగుటూరు ఎంజేపీ స్కూల్ కు శాశ్వత భవనం
- త్వరలో భూమి పూజ చేస్తామన్న బాలవీరాంజనేయ స్వామి
- రూ.65 లక్షలతో బీటీ రోడ్డును ప్రారంభించిన మంత్రులు

సింగరాయకొండ నరసింహా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఒంగోలు జూలై 13, అనంత జనశక్తి న్యూస్



బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం వేల కోట్ల ఖర్చు చేస్తోందని మంత్రులు సవిత, బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. త్వరలో అర్హులకు కొత్త పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇకపై హాస్టళ్లకు బదులు గురుకులాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. కొండేపి నియోజక వర్గంలోని సింగరాయకొండలో మంత్రులు పర్యటించారు. అక్కడ రూ.65 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం టంగుటూరు ఎంజేపీ గురుకుల బాలిక పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడు గుర్రాల్లా పరుగులు తీయిస్తోందన్నారు. వీబీ రామ్ జీ పథకం ద్వారా వేల కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సింగరాయ కొండ ఎస్టీ కాలనీలో రూ.65 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డే దీనికి నిదర్శనమన్నారు.

**బడుగుల విద్యకు వేల కోట్లు కేటాయింపు**

ఎస్సీ, ఎస్టీ, బీసీల విద్య కోసం కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రూ.వేల కోట్లు వెచ్చించిందని మంత్రి డోలా బాల వీరాంజనేయులు తెలిపారు. రూ.500 కోట్లతో బీసీ గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రెండేళ్లలో ఎస్సీ హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు, నిర్మాణాలకు రూ.500 కోట్లకు పైగా వెచ్చించామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో మూడు ఎక్స్ లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన ఎస్సీ విద్యార్థులకు మరింత నైపుణ్యం పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. టంగుటూరు ఎంజేపీ స్కూల్ కు శాశ్వత భవన నిర్మాణానికి రూ.45 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

**నమస్కారమండీ బాగున్నారా..?**

హలో... నమస్కారమండీ బాగున్నారమ్మా..? మేం మంత్రులం మాట్లాడుతున్నామంటూ పే ఫోన్ ద్వారా విద్యార్థినుల తల్లిదండ్రులను మంత్రులు సవిత, డోలా బాలవీరాంజనేయ స్వామి పలుకరించారు. టంగుటూరు ఎంజేపీ స్కూల్లో బోధన బాగుందా... మీ పిల్లలు బాగా చదువుతున్నారా... నాణ్యమైన భోజనం పెడుతున్నారా... ? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయా... ఫ్రీ బస్ సౌకర్యం ఉపయోగించుకున్నారా..? అని విద్యార్థినుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. మంత్రులు సవిత, డోలా బాలవీరాంజనేయుల స్వామి టంగుటూరు ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లను, వంట గదిలోని నిత్యావసర సరుకుల పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని గతంలో కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు మంత్రులు సవిత,బాలవీరాంజనేయులు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ ట్రాక్ షూట్లు, షూస్ అందజేశారు. అంతకుముందు మంత్రులు సవిత, డోలా బాలవీరాంజనేయుల స్వామి సింగరాయకొండలోని లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదాశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ నిర్వాహాకులు, అర్చకులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా డా. నూకసాని బాలాజీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుచిత్ర, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### త్వరలో పెన్షన్లు, ఇళ్ల స్థలాలు : మంత్రి సవిత

**రాష్ట్రంలో బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా టంగుటూరు ఎంజేపీ గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాన్ని సమకూర్చనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్థలం సమకూర్చామని, రూ.45 కోట్లతో త్వరలో పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. మొదటి విడతగా రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలో ఆరు ఎంజేపీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో హాస్టళ్లకు బదులు గురుకులాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. గురుకులాల ఏర్పాటుతో నాణ్యమైన విద్యతో పాటు ఆహార భద్రతతో కూడిన రక్షణ విద్యార్థులకు లభిస్తుందన్నారు. రెండేళ్ల కూటమి పాలనలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి చేపట్టామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. త్వరలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేయనున్నామన్నారు. వాటితో పాటు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వచ్చే ఏ ఎన్నికల్లోనైనా కూటమి విజయం తథ్యమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు.**

# ఎస్ఐఆర్ ను వెంటనే పూర్తి చేయాలి..

- జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్..

అనంతపురం, జులై 13 :అనంత జనశక్తి న్యూస్



అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ నోడల్ అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ

ప్రత్యేక దృష్టి పెట్టి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం నగరంలోని వేణుగోపాల్ నగర్ లో ఉన్న 204, 205 పోలింగ్ కేంద్రాల పరిధిలో, నాయక్ నగర్ ప్రాంతంలో ఉన్న 149, 150 పోలింగ్ కేంద్రాల పరిధిలో, హమాలీ కాలనీ ఏరియాలో ఉన్న 275, 276, 277 పోలింగ్ కేంద్రాల పరిధిలో, రుద్రంపేట ప్రాంతంలో ఉన్న 36, 37, 38 పోలింగ్ కేంద్రాల పరిధిలో, రెండవ రోడ్డు ప్రాంతంలో ఉన్న 64, 65, 66 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ను జాయింట్ కలెక్టర్ మరియు చేసి, మరియు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను జెసి సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను గడువులోపు పూర్తి చేయాలని, ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి అప్లోడ్ చేసేందుకు మంగళవారం ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని, వేగవంతంగా ఫారాలను అప్లోడ్ చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విషయంలో ఏవైనా లోపాలు, నిర్లక్ష్యం లేదా అశ్రద్ధ కనిపిస్తే తీవ్రంగా పరిగణించబడుతుందని మరియు సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఎస్ఈ సత్యనారాయణ, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# కరువు నేలలో ప్రజా ఉద్యమాల జ్యోతి గుత్తి రామకృష్ణకు ఘన నివాళి



- సాహితీ స్రవంతి–తెలుగు వెలుగు సంయుక్త ఆధ్వర్యంలో 111వ జయంతి వేడుకలు

అనంతపురం, జూలై 13:అనంత జనశక్తి న్యూస్

అనంతపురం వంటి కరువు జిల్లాలో ప్రజల సంక్షేమాన్ని జీవిత లక్ష్యంగా చేసుకుని, కమ్యూనిస్టు ఉద్యమ సహచరులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడు గుత్తి రామకృష్ణ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు.సాహితీ స్రవంతి, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు టీవీ రెడ్డి, సాహితీ స్రవంతి జిల్లా కమిటీ సభ్యులు రవిచంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష కార్యకర్తలు, అభిమానులు గుత్తి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మానవతావేత్త తరిమెల అమర్నాథ్ రెడ్డి, విశాలాంధ్ర ఈరన్న, సాహితీవేత్తలు జెట్టి జయరాం, సీనియర్ పాత్రికేయులు ఆజాద్ తదితరులు మాట్లాడుతూ, గుత్తి రామకృష్ణ ప్రజల కష్టసుఖాలను తనవిగా భావిస్తూ కరువు, తాగునీటి కొరత, రైతుల సమస్యలు, వ్యవసాయ సంక్షోభం, కార్మికులు, పేదల హక్కుల కోసం జీవితాంతం ఉద్యమ బాటలో నడిచారని పేర్కొన్నారు.ప్రజా ఉద్యమాల ద్వారానే సామాజిక మార్పు సాధ్యమనే విశ్వాసంతో ఆయన కమ్యూనిస్టు సహచరులతో భుజం భుజం కలిపి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని కొనియాడారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా భావించిన ఆయన నిరాడంబర జీవనం,సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. బ్రిటిష్ పాలనలో ప్రజలపై జరుగుతున్న అణచివేతను ప్రత్యక్షంగా చూసిన గుత్తి రామకృష్ణ స్వాతంత్ర్యోద్యమ భావజాలం వైపు ఆకర్షితులయ్యారని, స్వదేశీ ఉద్యమం, జాతీయోద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు కృషి చేశారని వక్తలు గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా ఆయన పోరాటం ఆగలేదని, రాజకీయ స్వేచ్ఛతో పాటు సామాజిక, ఆర్థిక స్వేచ్ఛ కూడా ప్రజలకు అందాలని భావించి అనంతపురం జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని పేర్కొన్నారు. తాగునీరు, సాగునీరు, ఉపాధి, విద్య, వైద్యం వంటి ప్రాథమిక హక్కుల కోసం ప్రజలతో కలిసి పోరాటాలు సాగించారని వివరించారు.వామపక్ష, కమ్యూనిస్టు ఉద్యమాలతో అనుబంధం పెంచుకున్న గుత్తి రామకృష్ణ సంఘటిత ప్రజాశక్తే మార్పును తీసుకురాగలదనే నమ్మకంతో పనిచేశారని, రైతు, కార్మిక, విద్యార్థి, యువజన ఉద్యమాలకు తనవంతు మద్దతు అందిస్తూ సామాజిక చైతన్యానికి కృషి చేశారని తెలిపారు.ఆయన ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అదే పోరాట పంథాను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వామపక్ష నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గుత్తి రామకృష్ణ స్ఫూర్తితో ప్రముఖ పద్య రచయిత ఒంటెద్దు రామలింగారెడ్డిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గుత్తి రామకృష్ణ కుటుంబ సభ్యులు, పాత్రికేయులు అనిల్ రెడ్డి, డేవిడ్, రామాంజనేయులు, భాస్కర్, శ్రీనివాసులు, అనంత కవులు రియాజుద్దీన్, గుడిపాటి సూర్యం, డాక్టర్ అంకె రామలింగయ్య, తోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్ వాడి నిర్మాణానికి స్థలం పరిశీలన

అగళి జూలై 13,అనంత జనశక్తి న్యూస్

**మండల కేంద్రంలోని యస్.సి. కాలనీ లో ఆర్.డి.టి ఆఫీస్ దగ్గర ఉన్న బోరుకు ఫిల్టర్ సెట్ చేయించారు. అలాగే ప్రభుత్వ అంగన్వాడీ లేనందున కొత్తగా అంగన్వాడీ నిర్మించడానికి స్థలంను మండల జడ్పీటీసీ వి.ఉమేష్, ఆర్.డి.టి.ఎటిల్ ఓబులేష్, పంచాయితి సెక్రటరీ రంగనాథ్, కమ్మరి శివన్న సోమవారం స్థలాన్ని పరిశీలించారు.**



# సంపూర్ణంగా ఎస్ ఐ ఆర్ పూర్తి.

- ధర్మవరం మున్సిపాలిటీ ఎస్ ఐ ఆర్ ప్రగతిలో 98 శాతము పూర్తిచేశాం.
- మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య.

ధర్మవరం జులై 13,
అనంత జనశక్తి న్యూస్:



కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ధర్మవరంలోని 40 వార్డులలో జూలై 13 వ తేదీ నాలుగు గంటలకు ప్రగతి నివేదికలో 98 శాతం పూర్తి చేసామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... జూలై 13 వ తేదీ నాటికి 1,06,554 మంది ఓటర్లకు గాను 1,04,241 పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన 2,313 ఓటర్లను తప్పనిసరిగా సోమవారం రాత్రి లోపు పూర్తి చేస్తామని తెలిపారు. జూలై 13 వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు 98 శాతము పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపేష్ పాల్గొన్నారు.

# జిల్లాలో 'జలధార-జలహారతి ' కార్యక్రమం ఘన విజయం



- 100 శాతం లక్ష్యాలు పూర్తి చేసిన అధికార యంత్రాంగానికి సీఎం చంద్రబాబు అభినందనలు

పుట్టపర్తి, జూలై 13: అనంత జనశక్తి న్యూస్

జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జలధార-జలహారతి' 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్దేశిత లక్ష్యాల ప్రకారం వంద శాతం విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమం సాధించిన ఈ అద్భుత విజయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.కార్యక్రమ అమలుపై ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సాధించిన వంద శాతం ఫలితాలను ప్రశంసిస్తూ, జిల్లా కలెక్టర్‌తో పాటు క్షేత్రస్థాయిలో శ్రమించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి సీఎం ప్రత్యేక అభినందనలు తెలియజేశారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ నీటి సంరక్షణ కార్యక్రమాలను కొనసాగించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు.జిల్లాలో జల వనరులను సంరక్షించడం, పునరుద్ధరించడం, కురిసిన ప్రతి వర్షపు బొట్టును భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టడం, భూగర్భ జలమట్టాలను పెంచడం, రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా శాశ్వత భద్రత కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని కలెక్టర్ వివరించారు.వంద రోజుల ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా చెరువులకు నీరు చేరే ప్రధాన కాలువలు, ఫీడర్ ఛానెళ్లను బాగు చేయడంతో పాటు వాగులు, డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. అలాగే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలు, ఇతర ఆటంకాలను తొలగించి నీటి సరఫరాను సుగమం చేసినట్లు పేర్కొన్నారు.ఈ పనుల ఫలితంగా రానున్న వర్షాకాలంలో జిల్లాలోని చెరువులన్నీ జలకళలాడటంతో పాటు భూగర్భ జలమట్టాలు గణనీయంగా పెరిగి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిగా నెరవేరుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.'జలధార-జలహారతి' కార్యక్రమం విజయవంతం కావడంలో ఇరిగేషన్ శాఖ, డ్వామా, గ్రౌండ్ వాటర్ శాఖ, గ్రామ పంచాయతీల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో, అంకితభావంతో కృషి చేశారని కలెక్టర్ కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే సమన్వయంతో జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ కు ఈనెల 14వతేదీన తుది గడువు..

- జిల్లాలో ఎస్ఐఆర్ కింద అన్ కలెక్టబుల్ (మరణాలు, డబుల్స్, అడ్రస్ లు దొరకనివి, తదితర) వాటితో కలుపుకుని 20,05,803 (మొత్తం 98.39 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటైజ్డ్ చేయడం జరిగింది..
- జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్..

అనంతపురం, జులై 13 :అనంత జనశక్తి న్యూస్

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 14వ తేదీన మంగళవారం ఒక్క రోజు తుది గడువు ఉందని, ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకున్న వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను చెల్లించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 20,38,523 ఎన్యుమరేషన్ ఫారాలను అనగా పూర్తిగా 100 శాతం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జూన్ 15వ తేదీ నుంచి బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 2,226 మంది బిఎల్ఓలు ఉండగా, అందులో అందరు బిఎల్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 20,38,523 ఓటర్లు ఉన్నారని, అందులో ఇప్పటివరకు పూర్తిగా 100 శాతం అనగా 20,38,523 మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందించడం జరిగిందన్నారు. అందులో సోమవారం సాయంత్రం సాయంత్రం 6 గంటల వరకు 18,13,030 ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని (88.94 శాతం) డిజిటైజ్డ్ చేయగా, అన్ కలెక్టబుల్ కు సంబంధించి 1,92,773 (09.46 శాతం) ఎన్యుమరేషన్ ఫారాలు ఉండగా, మొత్తం అన్ కలెక్టబుల్ (మరణాలు, డబుల్స్, అడ్రస్ లు దొరకనివి, తదితర) వాటితో కలుపుకుని ఇప్పటివరకు జిల్లాలో 20,05,803 (98.39 శాతం) ఎన్యుమరేషన్ డిజిటైజ్డ్ చేయడం జరిగిందని తెలిపారు.ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా 15.06.2026 నుండి 14.07.2026 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేసి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు జరుగుతుంది మరియు అందులో ఒక పూరించిన ఎన్యుమరేషన్ ఫారం తిరిగి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిఎల్ఏలు, రాజకీయ పార్టీలు సహకారాన్ని అందించాలన్నారు. ఈనెల 14వ తేదీన మంగళవారం ఒక్కరోజే తుది గడువు ఉండడంతో ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకున్న వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను చెల్లించాలన్నారు. బిఎల్ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి స్థాయిలో డిజిటైజ్డ్ చేయడం చేయాలన్నారు.

# అనంతపురం డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ ఈబీ దేవి కడపకు బదిలీ

- అనంత నూతన డీఎంహెచ్ఓగా డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు
- అనంతపురం సర్వజనాస్పత్రి సీ.ఎస్.ఆర్ఎంఓగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి

అనంతపురం జూలై 14,
అనంత జనశక్తి న్యూస్



అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్) డాక్టర్ ఈబీ దేవి బదిలీ అయ్యారు. ఈమెను కడపలోని 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంఓగా బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం డీఎంహెచ్ఐగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అల్లూర్ సీహెచ్సీలో వైద్యులుగా పని చేస్తున్న డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. అదేవిధంగా అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి సీఎస్ ఆర్ఎంఓగా తిరుపతి జిల్లా తడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పని చేస్తున్న డాక్టర్ ఓ. శ్రీనివాసరెడ్డిని నియమించారు.



# ముఖంపై మొటిమలు, మచ్చలు తగ్గించే కలబంద, స్టీమ్ కాంబినేషన్

**ప్రకృతి మనకి అందించిన అద్భుతమైన రహస్యాల్లో కలబంద ఒకటి. కలబందను పూర్వకాలం నుంచి అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడే సంజీవనిగా అధ్యయనం పేర్కొంది. నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో తీవ్ర ఒత్తిడి, కాలుష్యం, కలుషిత ఆహారం వంటి కారణాల వల్ల చర్మం తన సహజ సిద్ధమైన మెరుపును కోల్పోతుంది. అలసిన ముఖం, ముఖంపై ముడతలు, మొటిమలు మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అద్దంలో చూసుకున్నప్పుడు మనకే ఒక రకమైన ఆత్మనూన్యత కలుగుతుంది.**



అయితే.. ఈ సమస్యలను తొలగించుకోవడానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఎలాంటి ఖర్చు లేకుండా మన ఇంటి దగ్గర లభించే కలబందతో అద్భుతాలు చేయొచ్చు. ముఖ్యంగా వేడినీటి ఆవిరితో కలిపి కలబందను ఉపయోగించడం అనేది ఒక అద్భుతమైన కాంబినేషన్ అనే చెప్పాలి. వేడి నీటి ఆవిరి చర్మ రంధ్రాలను సున్నితంగా తెరిచి లోపలి మురికిని బయటకి పంపితే, కలబంద చర్మ రంధ్రాల లోతుల్లోకి వెళ్లి చర్మానికి ప్రాణం పోస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల ముఖంపై పేరుకున్న మలినాలు తొలగిపోయి చర్మం మృదువుగా మారుతుంది.

**అలోవెరా + హాట్ వాటర్ స్టీమ్ ప్రయోజనాలు**

ముఖానికి ఆవిరి పట్టడం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుంటాయి. అప్పుడు కలబంద జెల్ ఉపయోగించడం వల్ల చర్మ లోపలి పొరల వరకు వెళ్లి పోషణను అందిస్తుంది. చర్మ కణాల్లో పేరుకుపోయిన జిడ్డు, మురికి, మృతకణాలను తొలగిస్తుంది. అంతే కాకుండా అలోవెరాలో సుమారు 95 శాతం నీరు ఉంటుంది.

కాబట్టి ఇది చర్మానికి తేమను అందిస్తుంది. ఇక అలోవెరాలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలు రావడానికి కారణమయ్యే బ్యాక్టీరియాను నశింపజేస్తాయి. అలోవెరా, వేడి నీటి ఆవిరి కాంబినేషన్ రక్తప్రసరణను మెరుగుపరిచి ముఖానికి సహజమైన కాంతిని ఇస్తుంది. చర్మంపై ఉన్న ముడతలను తగ్గించి యవ్వనంగా ఉంచుతుంది.

**అలోవెరా + హాట్ వాటర్ స్టీమ్ ప్రాసెస్**

మొదట ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇప్పుడు కొంచెం కలబంద జెల్ తీసుకుని ముఖంపై ఒక లేయర్‌లా 5 నిమిషాల పాటు మర్దన చేయండి. తర్వాత ఒక గిన్నెలో కొన్ని నీళ్లు తీసుకుని బాగా మరిగించండి. నీళ్లు మరిగాక స్టవ్ ఆఫ్ చేసి ఆ గిన్నెను దించి ఒక చోట పెట్టుకుని ఒక టవల్ లేదా బెడ్‌షీట్ కప్పుకుని గిన్నెలో నుంచి ఆవిరి ముఖానికి తగిలేలా చూసుకోండి.

ముఖాన్ని గిన్నెకు మరీ దగ్గరగా పెట్టకండి. ఇలా ఓ 5 నిమిషాల పాటు ఆవిరి పట్టండి. ఆ తర్వాత ముఖాన్ని శుభ్రంగా కడిగేసుకుని ఒక మెత్తటి గుడ్డతో స్మూత్‌గా తుడుచుకోవాలి. కొద్దిసేపటి తర్వాత మంచి మాయిశ్చరైజర్ రాసుకోండి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పొడి చర్మం ఉండే వాళ్లు వారానికి ఒకసారి, జిడ్డు చర్మం ఉండే వాళ్లు వారానికి రెండు సార్లు చేసుకుంటే సరిపోతుంది.

సున్నితమైన చర్మం ఉన్న వాళ్లు ఆవిరిపట్టే సమయాన్ని 3 నిమిషాలకు కుదించుకోండి. ఆవిరి పడితే చర్మానికి హాయిగా ఉండాలి కానీ మంట పుట్టకూడదు.



కలబంద, వేడినీటి ఆవిరితో పాటు కొంచెం రోజ్ వాటర్ కూడా కలుపుకుంటే మంచి సువాసన ఉంటుంది.

అలోవెరా జెల్ ఉపయోగించే ముందు చేతిపై కొంచెం ప్యాచ్ టెస్ట్ చేసుకోండి.

ఆవిరి పట్టే సమయంలో కళ్లు మూసుకోవడం మంచిది.



# గోధుమ పిండి, శనగ పిండి, మైదా పిండికి పురుగులు పట్టకుండా పాటించాల్సిన చిట్కాలు



**వంటిల్లు మన ఆరోగ్య భాండాగారం. వంటింటిలో మనం నిల్వ చేసే ప్రతి వస్తువు వెనుకు ప్రత్యేకమైన శ్రద్ధ అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో పిండి పదార్థాల పాత్ర చాలా కీలకమైనది. ఉదయం, సాయంత్రం పూట చపాతీలు, సాయంత్రం కరకరలాడే బజ్జీలు, నోరూరించే పిండి వంటలు ఇలా ఏది చేయాలన్నా గోధుమ పిండి, శనగ పిండి, మైదా పిండి అవసరం. అయితే ఇక్కడ ఒక సమస్య ఉంది.**



అదేమిటంటే.. వీటిని మనం పట్టించుకున్నా, కొనుక్కున్నా పిండి అయినా వాటికి చిన్నపాటి తేమ తగిలినా లేదా నిల్వ చేయడంలో ఏమాత్రం అశ్రద్ధ వహించినా పురుగులు చేరి ఆ పిండిని నాశనం చేస్తాయి. దీనివల్ల ఆ పిండి వృథా అవ్వడమే కాకుండా.. ఆ పిండిని వాడితే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మన అమ్మమ్మలు, నానమ్మలు పిండి నిల్వ చేయడంలో పాటించే చిట్కాలను ఇప్పుడు తెలుసుకుందాం..

**గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ**

సాధారణంగా గోధుమ పిండి, శనగపిండి, మైదా పిండి వంటి వాటిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేయాలి. పిండి నిల్వ ఉంచే డబ్బాల మూత వదులుగా ఉంటే గాలి చొరబడి పిండికి పురుగులు పడతాయి. కాబట్టి పిండిని ఎయిర్టైట్ కంటైనర్లలో నిల్ల చేయడం మంచిది.

అయితే పిండిని గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ ఉంచినా సరే.. అప్పుడప్పుడూ బయట తీసి కాసేపు ఎండలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల పిండిలో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. కాబట్టి పిండిని కొద్దిగా ఉపయోగించగానే





ప్యాకెట్లలోనే ఉంచకుండా గాలి తగలని డబ్బాల్లో నిల్వ చేయాలి.

**బిర్యానీ ఆకులు, లవంగాలు వేయడం వల్ల..**

సాధారణంగా చెక్క, లవంగాలు, బిర్యానీ ఆకులు వంటి వాటిని మనం బిర్యానీలు మరియు నాన్వెజ్ వంటకాల్లో ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. అయితే గోధుమ, శనగ, మైదా పిండి స్టోర్ చేసే డబ్బాల్లో రెండు మూడు బిర్యానీ ఆకులు, 4 లేదా 5 లవంగాలు వేయడం వల్ల ఆ వాసనకు పురుగులు దరిచేరవు. దీంతో పిండి ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది.

**పిండి రకాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి**

చాలా మంది తెలిసో తెలియకో నిల్వ ఉంచిన పిండిలో కొత్తగా తీసుకొచ్చిన పిండిని కలుపుతుంటారు. ఇలా చేయడం వల్ల మొత్తం పిండికి పురుగు పట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి పాత పిండిని మొత్తం ఉపయోగించడం లేదా రెండింటినీ వేరువేరు డబ్బాల్లో నిల్వ చేయడం మంచిది. పిండి నిల్వ ఉంచే డబ్బాలను కడిగి బాగా తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడిచి పూర్తిగా ఆరిన తర్వాత పిండిని నిల్వ చేయాలి.

అలాగే పిండిని నిల్వ చేయడానికి ప్లాస్టిక్ డబ్బాలకు బదులుగా గాజు సీసాలను వినియోగించడం మంచిది. ఇక శనగ పిండి త్వరగా పాడవుతుంది కాబట్టి దీనిని ఫ్రిజ్‌లో నిల్వ చేయడం ఉత్తమం. ఇక గోధుమ పిండి ఎక్కువ మొత్తంలో పట్టించినప్పుడు అందులో కొంచెం ఉప్పు కలిపి నిల్వ చేస్తే పురుగు పట్టదు.

# అప్పలరాజు కొడుకు సరెండర్



**అమరావతి, జులై 13, అనంతజనశక్తి న్యూస్**

మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు తనయుడు ఆరవ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు తన లాయర్లతో కలిసి వచ్చిన ఆరవ్.. పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కాశీబుగ్గలో జులై పదో తేదీన రోడ్డు ప్రమాదం జరిగింది. సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ బైక్ డ్రైవింగ్ చేస్తూ గౌర్రెల కాపరి దానయ్యను ఢీకొట్టడంతో అతను చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. గౌర్రెల కాపరి దానయ్య మృతికి ఆరవ్ అతివేగంతో బైక్ నడపడమే కారణమని సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. అయితే ఘటన జరిగిన తర్వాత పోలీసులు అక్కడికి చేరుకునేలోపే.. ఆరవ్‌ను ఓ కారులో తరలించినట్లు గుర్తించారు. తాజాగా సీదిరి ఆరవ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారిస్తున్నారు.

మరోవైపు ఈ కేసులో తానే బైక్ నడిపినట్లు సిద్ధు అనే యువకుడు తొలుత పోలీసులకు లొంగిపోయాడు. అయితే పోలీసుల దర్యాప్తులో శుక్రవారం రోజున ప్రమాదం జరగడానికి ముందు సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంకులో ఆరవ్ పెట్రోల్ పోయించుకున్నట్లు సీసీ ఫుటేజీ బయటకు వచ్చింది. దీంతో ఈ కేసులో ఆరవ్ నిందితుడిగా పోలీసులు తేల్చారు. ఈ క్రమంలోనే అతను పోలీసులకు లొంగిపోయారు.

**అసలేం జరిగిందంటే..**

మరోవైపు కాశీబుగ్గ సమీపంలో ఉన్న పారిశ్రామికవాడ పాత జాతీయరహదారిపై శుక్రవారం రోజు రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. దానయ్య అనే గౌర్రెల కాపరిని.. ఎదురుగా వచ్చిన బైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

అయితే ఈ ప్రమాదానికి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కొడుకు ఆరవ్ కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఓ పెట్రోల్ బంకు వద్ద ఆరవ్ బైక్‌లో పెట్రోల్ పోయించుకున్నారని.. అక్కడి నుంచి 500 మీటర్ల దూరంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అలాగే పోలీసులు అక్కడికి చేరుకోకముందే ఆరవ్‌ను ఘటనాస్థలి నుంచి ఓ కారులో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అయితే ఈ వ్యవహారంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.. ఆరవ్ బదులుగా సిద్ధార్థ అనే యువకుడిని నిందితుడిగా చేర్చారని.. అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేసినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై విమర్శలు రావటంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపిన పోలీసులు.. బైక్ నడిపి ప్రమాదానికి కారణమైంది అప్పలరాజు కుమారుడు ఆరవ్ అని తేల్చారు. ప్రస్తుతం ఆరవ్ లొంగిపోవటంతో అతన్ని విచారిస్తున్నారు.

# భోగాపురం విమానాశ్రయానికి ఇమ్మిగ్రేషన్ హోదా

**అమరావతి జులై 13, అనంత జనశక్తి న్యూస్**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం అధికారిక ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా గుర్తింపునిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అధీకృత ఇమ్మిగ్రేషన్ కేంద్రాల జాబితాను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి.. హోం శాఖ ఈ సవరణలు చేసింది. ఈ నిబంధనల ప్రకారం దేశంలోని విమానాశ్రయాల విభాగంలో కేటగిరీ 1 కింద 39వ నంబరుగా భోగాపురం విమానాశ్రయాన్ని చేర్చారు. ఈ అధికారిక గుర్తింపుతో భోగాపురం నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమైనప్పుడు విదేశాలకు వెళ్లే, విదేశాల నుండి వచ్చే ప్రయాణికుల పాస్‌పోర్ట్, వీసా వెరిఫికేషన్ ప్రక్రియలను ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇక్కడే పూర్తి చేయడానికి మార్గం సుగమమైంది.

**ఇమ్మిగ్రేషన్ హోదా కీలకం...**

నిబంధనల ప్రకారం ఏదైనా విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సర్వీసులు నడపాలంటే కేంద్ర ప్రభుత్వం దానికి ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్ హోదా కల్పించడం



అత్యంత కీలకం. ఈ చట్టబద్ధమైన ప్రక్రియ పూర్తి కావడంతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ అంతర్జాతీయ విమానాలకు సర్వసిద్ధంగా మారుతోంది. విశాఖపట్నం సమీపంలో నిర్మిస్తున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం భవిష్యత్తులో ఉత్తరాంధ్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయానికి అదనంగా, ఈ ప్రాంతంలో పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీని తట్టుకునేలా భోగాపురాన్ని ప్రధాన ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారు.

మరోవైపు.... భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రానున్న కాలంలో వాణిజ్య విమాన సర్వీసులను ప్రారంభించేందుకు వీలుగా మౌలిక వసతుల కల్పన చివరి దశకు చేరుకుంది. ఏటా దాదాపు 40 మిలియన్ల (4 కోట్లు) ప్రయాణికులకు సేవలు అందించేలా ఈ విమానాశ్రయాన్ని డిజైన్ చేశారు.

ముఖ్యంగా 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న టెర్మినల్ భవనాన్ని 'ఎగిరే చేప' (ఫ్లయింగ్ ఫిష్) ఆకృతిలో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ విమానాశ్రయం లోపలి, వెలుపలి భాగాలు ఉత్తరాంధ్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటూనే, దేశంలోని మెట్రో నగరాల ఎయిర్‌పోర్ట్‌లకు ధీటుగా అత్యాధునిక వసతులుంటాయి.

గత వారమే కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి అధికారిక 'ఏరోడ్రోమ్ లైసెన్స్' మంజూరు చేసింది. ప్రాజెక్టు తుది దశకు చేరుకోవడంలో ఇదొక మైలురాయిగా నిలిచింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ లైసెన్స్ పత్రాలను ఢిల్లీలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ప్రతినిధులకు స్వయంగా అందజేశారు. ఈ లైసెన్స్ రావడంతో భోగాపురం విమానాశ్రయం వాణిజ్య విమానాల రాకపోకలకు పూర్తిగా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## ట్రంప్, నెతన్యాహు, మెలోని ఇరాన్ 'రివెంజ్ లిస్ట్' లో..

# మొత్తం 13 మంది ప్రపంచ నేతలు



**అమరావతి జులై 13, అనంత జనశక్తి న్యూస్**

ఫోటోలతో కూడిన ఒక వివాదాస్పద ఇన్ఫోగ్రాఫిక్ మధ్యప్రాచ్యంలో అమెరికాఇరాన్ మధ్య యుద్ధం ముదురుతున్న తరుణంలో ఇరాన్ రాజధాని టెహ్రాన్ నుండి వెలువడే ప్రభుత్వ పత్రిక 'హమ్‌షాహ్రీ' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మరణానికి కారణమైన 13 మంది విదేశీ రాజకీయ, సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకోవాలంటూ వారి ఫోటోలతో కూడిన ఇన్ఫోగ్రాఫిక్‌ను ఈ పత్రిక విడుదల చేసింది.

అలీ ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన కుమారుడు అయాతొల్లా మొజ్తబా ఖమేనీ తొలిసారి బహిరంగంగా స్పందించిన కొద్దిసేపటికే ఈ జాబితా వెలుగులోకి వచ్చింది. "ప్రతికారం అనేది మా జాతీయ సంకల్పం, దీనిని ఖచ్చితంగా అమలు చేసి తీరుతాం. మా లిస్టులో ఉన్న ఈ నేరస్థులు, తమ పడకలపై ప్రశాంతంగా మరణించాలనే కోరికను తమతో పాటే సమాధి చేసుకుంటారు" అని మొజ్తబా ఖమేనీ హెచ్చరించారు.

అయితే మొజ్తబా ఖమేనీ నిర్దిష్టంగా ఎవరి పేర్లనూ బహిరంగంగా ప్రస్తావించలేదు. అలాగే ఈ పత్రిక ప్రచురించిన జాబితాను ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించినట్లు ఎలాంటి ఆధారాలు లేవు.

ఇరాన్ 'రివెంజ్ లిస్ట్' లోని 13 మంది నేతలు:

హమ్‌షాహ్రీ పత్రిక ప్రచురించిన ఇన్ఫోగ్రాఫిక్ ప్రకారం లక్ష్యంగా చేసుకోవాల్సిన నాయకులు వీరే:

డొనాల్డ్ ట్రంప్ – అమెరికా అధ్యక్షుడు
బెంజమిన్ నెతన్యాహు – ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి
జార్జియా మెలోని – ఇటలీ ప్రధాన మంత్రి
కీర్ స్టార్మర్ – బ్రిటన్ ప్రధాన మంత్రి
ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ – ఫ్రాన్స్ అధ్యక్షుడు
ఫ్రీడ్రిచ్ మెర్జ్ – జర్మనీ ఛాన్సలర్
ఇజ్రాయెల్ కాట్జ్ – ఇజ్రాయెల్ రక్షణ మంత్రి
గిడియాన్ సార్ – ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి
ఇయాల్ జమీర్ – ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్
మార్కో రూబియో – అమెరికా విదేశాంగ మంత్రి
పీట్ హెగ్‌సెత్ – అమెరికా రక్షణ మంత్రి
జనరల్ మైఖేల్ ఎరిక్ కురిల్లా / బ్రాడ్ కూపర్ – యూఎస్ సెంట్రల్ కమాండ్ కమాండర్లు
మైక్ హక్కబీ – ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి

ఈ జాబితాలో యూరప్ నేతలు ఎందుకు ఉన్నారు?

అమెరికా, ఇజ్రాయెల్ అధికారులతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ దేశాల అధినేతలను కూడా ఇరాన్ ఈ జాబితాలో చేర్చింది. తమ భూభాగంపై అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని ఇరాన్ ఆరోపిస్తోంది. అంతేకాకుండా, అమెరికా సైనిక విమానాలు తమ వైమానిక దాడుల కోసం యూరప్ దేశాల వాయుమార్గాన్ని ఉపయోగించుకోవడానికి అనుమతించడం ద్వారా ఆయా దేశాలు కూడా ఈ దాడుల్లో భాగస్వాములయ్యాయని టెహ్రాన్ భావిస్తోంది.

ప్రస్తుత యుద్ధ పరిస్థితి

హార్ముజ్ జలసంధి వేదికగా అమెరికా, ఇరాన్ దళాల మధ్య పోరు తీవ్రరూపం దాల్చింది. ఒక వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేయడంతో, అమెరికా ఇరాన్ యొక్క ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, రాడార్లు, డ్రోన్ కేంద్రాలపై భారీ దాడులు చేసింది. దీనికి ప్రతికారంగా ఇరాన్ కూడా అమెరికా స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై (బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ, జోర్డాన్, ఒమన్) క్షిపణులతో విరుచుకుపడింది. ఇరు దేశాల మధ్య గతంలో కుదిరిన తాత్కాలిక అవగాహన పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు భావిస్తున్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కోలుకోలేని దెబ్బ పడుతుందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్తాన్, ఖతార్, ఈజిప్ట్ దేశాలు శాంతి చర్చల కోసం చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ఫలించలేదు.

# అసత్యం, నిరాధారం

- **ప్రజలను తప్పుదారి పట్టించేదిగా**
- **అమెరికాతో ఒప్పందం వద్దనుకుంటున్నట్లు కథనాలు**
- **పీయూష్ గోయల్ క్లారిటీ**
- **సంచలన కథనాన్ని ప్రచురించిన రాయిటర్స్**

**అమరావతి జులై 13, అనంత జనశక్తి న్యూస్**

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయి. ఏదొక సమయంలో ఒప్పందాలు జరిగే అవకాశాలు ఉన్నట్లు వార్తలొచ్చాయి. అలాంటిది అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం నిరాకరిస్తోందంటూ రాయిటర్స్ తన కథనంలో ప్రచురించింది. ప్రస్తుతం ఈ కథనం జాతీయంగా.. అంతర్జాతీయంగా తీవ్ర దుమారం రేపుతోంది.

రాయిటర్స్ సంచలన కథనం ప్రచురించడంతో తాజాగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. భారత్అమెరికా వాణిజ్య ఒప్పందంపై రాయిటర్స్ ప్రచురించిన కథనాన్ని తీవ్రంగా ఖండించారు. అమెరికాతో త్వరితగతిన వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు భారత్ నిరాకరించిందని...మరింత అనుకూలమైన నిబంధనల కోసం వేచి చూస్తోందంటూ వచ్చిన వార్తలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. ఈ అంశంపై సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన పీయూష్‌గోయల్..రాయిటర్స్ కథనాన్ని పూర్తిగా తోసిపుచ్చారు.

"ఈ వార్త పూర్తిగా అసత్యం, నిరాధారం, ప్రజలను తప్పుదారి పట్టించేదిగా ఉంది. జూన్‌లో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ ఢిల్లీకి వచ్చినప్పుడు మా మధ్య అద్భుతమైన సమావేశాలు జరిగాయి.



ఇరు దేశాలు సమతుల్యమైన, వాణిజ్యపరంగా ప్రయోజనకరమైన, వ్యాపారాలు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు లాభదాయకమైన ఒప్పందం కుదుర్చుకునేందుకు తమ నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించాయి. ఆ లక్ష్య సాధన కోసం ఇరు దేశాల బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయి." అని పేర్కొన్నారు.

**రాయిటర్స్ కథనంలో ఏముంది?**

రాయిటర్స్ తన కథనంలో.. భారత్ ఇటీవల జరిగిన చర్చల్లో అమెరికాతో త్వరితగతిన వాణిజ్య ఒప్పందం చేసుకోవడాన్ని తిరస్కరించిందని.. మరింత మెరుగైన షరతుల కోసం వేచి చూస్తోందని పేర్కొంది. కొత్త వాణిజ్య భాగస్వాములు లభించడం, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటం, దేశీయ రాజకీయంగా అనుకూల పరిస్థితులు ఉండటంతో ప్రధాని మోడీ ప్రభుత్వం ఈ వైఖరిని అవలంబించిందని అధికారులు, విశ్లేషకుల సమాచారాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ కథనంలో పేర్కొంది. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన వాణిజ్య శాఖ సమావేశంలో కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. "భారత్అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ సిద్ధంగా ఉంది. సరైన సమయం వచ్చిన వెంటనే ఒప్పందంపై సంతకాలు జరుగుతాయి. మేము సిద్ధంగా ఉన్నాం. అయితే ప్రతి వాణిజ్య ఒప్పందం పరస్పర ప్రయోజనాలు, పోటీ దేశాలతో పోలిస్తే లభించే అవకాశాల ఆధారంగా ఉంటుంది. ప్రస్తుతం ఆ అంశాలను తుది రూపం ఇస్తున్నాం." అని తెలిపారు. మరోవైపు భారత్అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పై చర్చలు ఆశించిన విధంగానే కొనసాగుతున్నాయని రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. "బీటీఏ చర్చలు సానుకూలంగా సాగుతున్నాయి. ఎలాంటి ఆటంకాలు కనిపించడం లేదు. భారత్ అమెరికా నుంచి ఇంధన దిగుమతులను కూడా పెంచుతోంది. దీంతో దేశ ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం పెరుగుతోంది." అని చెప్పారు. అలాగే "భారత్, అమెరికా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ఇరు దేశాలకు ఒకరి అంచనాలు మరొకరికి స్పష్టంగా తెలుసు. ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంలో ఏముంటుందో కూడా ఇరు పక్షాలకు అవగాహన ఉంది. ప్రస్తుతం చర్చలు పూర్తిగా సానుకూల దిశలోనే కొనసాగుతున్నాయి." అని రాజేశ్ అగర్వాల్ స్పష్టం చేశారు.

# కేబుల్ దొంగలు అరెస్టు



**- 400 మీటర్ల కేబుల్ వైరు, రెండు స్టార్టర్లను స్వాధీనం**

**అగళి జూలై 13,అనంత జనశక్తి న్యూస్ :**

మండల పరిధిలోని బోరుబావులకు అమర్చిన కేబుల్ వైర్లను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 400మీటర్ల కేబుల్ వైరు, రెండు స్టార్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జి. రంగడు యాదవ్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మడకశిర రూరల్ సీఐ నేతృత్వంలో ఎస్ఐ రంగడు యాదవ్ సిబ్బందితో కలిసి కేబుల్ వైర్ల దొంగతనాలపై నిఘా పెట్టారు. అగళి మండలంలోని కదిరేపల్లి, ఇరిగేపల్లి గొల్లహట్టి, అగళి గ్రామాల్లో రాత్రివేళ బోరుబావుల వద్ద కేబుల్ వైర్లు దొంగిలిస్తున్న ఇద్దరిని గుర్తించినట్లు తెలిపారు.కర్ణాటక రాష్ట్రం శిర తాలూకా మూగనహళ్లి గ్రామానికి చెందిన సురేష్, అగళి మండలం కదిరేపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తిని సోమవారం ఇరిగేపల్లి గ్రామశివారులోని మైరాడ ప్లాన్ సంస్థకు చెందిన పాడుబడిన భవనం వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.నిందితుల నుంచి సుమారు 400 మీటర్ల కేబుల్ వైరు, రెండు స్టార్టర్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో

# ఆక్రమణల తొలగింపు

**అనంతపురం, జూలై 13:అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇరువైపులా రహదారులపై ఏర్పడిన ఆక్రమణలను సోమవారం నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సూచనల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు తెలిపారు.ఆసుపత్రి ముందు ఉన్న ఆక్రమణల కారణంగా మహిళలు, రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత, సౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండేలా ఆక్రమణలను తొలగించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమాన్ని పోలీసు శాఖ సహకారంతో నిర్వహించినట్లు కమిషనర్ వెల్లడించారు. రహదారిపై ఉన్న ఆక్రమణలను మాత్రమే తొలగించామని, చుట్టుపక్కల ఉన్న శాశ్వత కట్టడాలకు లేదా ఇతర ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.ఆక్రమణలు తొలగించే ముందు సంబంధిత వ్యక్తులకు గత వారం రోజులుగా మౌఖికంగా సమాచారం అందించడంతో పాటు మైక్ ద్వారా ప్రకటనలు కూడా చేశామని చెప్పారు. స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిసరాల్లో ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ సౌలభ్యాన్ని మెరుగుపరచడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కమిషనర్ జశ్వంత్ రావు స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు, ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

## సుప్రీంకోర్టులో

# విజయ్ సర్కారుకు ఊరట

- **గోవధ నిషేధ ఉత్తర్వులపై స్టే**
- **మే 27న మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు**
- **సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సీఎం విజయ్ సర్కారు**
- **లైసెన్స్ పొందిన ప్రదేశాల్లోనూ జంతువధ నిషేధం**

**అనంతపురం, జూలై 13:అనంత జనశక్తి న్యూస్**

తమిళనాడు వ్యాప్తంగా గోవధను నిషేధిస్తూ మద్రాసు హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. మే 27న హైకోర్టు వెలువరించిన ఈ వివాదాస్పద తీర్పును ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే సర్కారు సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. టీవీకే దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. గోవధ నిషేధంపై 1976 ఆగస్టు నాటి ఉత్తర్వులను అమలు చేయాలని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. బహిరంగ ప్రదేశాల్లో గోవధను నిషేధించాలని కోరుతూ హిందూ మక్కల్ కట్చి (హెచ్ఎంకే) జనరల్ సెక్రటరీ సూర్య ప్రశాంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఒక పరిధిని మించి ఉత్తర్వును వెలువరించిందని టీవీకే ప్రభుత్వం పేర్కొంది. లైసెన్స్ పొందిన ప్రదేశాల్లోనూ గోవధ నిషేధించడం చట్టవిరుద్ధమని వాదించింది. తమిళనాడు జంతు రక్షణ చట్టం 1958, పట్టణ స్థానిక సంస్థల చట్టం 1998, 2023 నిబంధనలు జంతు వధను క్రమబద్ధీకరించడానికే ఉద్దేశించినవి తప్ప.. పూర్తిగా నిషేధించడానికి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇరువర్గాల వాదలను విన్న ధర్మాసనం.. మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై స్టేవిధిస్తూ నిర్ణయం తీసుకుంది. పాల ఉత్పత్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా గోవధను నిషేధించిన 1976 నాటి ఉత్తర్వు ఆధారంగా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీనారాయణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వును జారీ చేసింది. ఈ తీర్పును రాసిన జస్టిస్ స్వామినాథన్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం ఆవులు, దూడలు, పాలను ఉత్పత్తి చేసే ఇతర జంతువులు, అలాగే బరువులు మోసే పశువధ నిషేధానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నొక్కిచెప్పారు. రాజ్యాంగ పరిషత్తు చర్చల సమయంలోనూ గోవు ఒక పూజ్యమైన జంతువని, శ్రీకృష్ణుని కాలం నుంచి అది మన నాగరికతతో ముడిపడి ఉందని నొక్కిచెప్పారని న్యాయమూర్తి స్పష్టం చేశారు. సాంప్రదాయంగా బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక నిబంధనలకు అనుగుణంగా బహిరంగ ప్రదేశాలు, మతపరమైన సమావేశాలలో జంతుబలి నిర్వహిస్తారు. అదేవిధంగా తమిళనాడులోని అనేక హిందూ దేవాలయాలు కూడా వార్షిక ఉత్సవాల సందర్భంగా ఆచారం ప్రకారం జంతుబలులను నిర్వహిస్తాయి. ఇటువంటి బలులను కేవలం లైసెన్స్ పొందిన వధశాలలకే పరిమితం చేయడం ఆచరణ సాధ్యం కాదని ప్రభుత్వంతో పాటు పలువురు వాదిస్తున్నారు. ఎందుకంటే పండుగల డిమాండ్‌ను తట్టుకునే సామర్థ్యం లైసెన్స్ పొందిన జంతు వధ కేంద్రాలకు లేదు. తమిళనాడు జంతు సంరక్షణ చట్టం, వధశాలలను నియంత్రించే ఇతర నిబంధనలు సహా ప్రస్తుతం ఉన్న చట్టాలు, జంతువులను ఎక్కడ, ఏ పరిస్థితులలో వధించవచ్చో ఇప్పటికే నియంత్రిస్తున్నాయని, కానీ పూర్తి నిషేధాన్ని విధించడం లేదని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది.



# ఇద్దరు నాయికలతో టైగర్ యాక్షన్?




'దే దే ప్యార్ దే 2', 'పతి పత్నీ ఔర్ వో దో' లాంటి చిత్రాలతో ఇటీవలే తెరపై మెరిసింది కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్. ఈ మధ్య కాలంలో పలు వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిందీమె. అయినా వరుస అవకాశాల్ని అందుకుంటూనే ఉంది. ఇందులో భాగంగా ఇప్పుడామె ఖాతాలో మరో చిత్రం చేరినట్లు తెలుస్తోంది. టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రలో రెమో డిసౌజా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడిందులో కథానాయికగా రకుల్‌ని ఎంపిక చేసిందట చిత్రబృందం. ఈమెతో పాటు ప్రగ్యా జైస్వాల్ కూడా మరో నాయికగా కనిపించనుందని సమాచారం. ఈ యాక్షన్ డ్రామాలో టైగర్‌తో కలిసి ఈ ఇద్దరు భామలు చేసే సందడి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని, వచ్చే నెల మొదటి వారంలో ముంబయిలో చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఇద్దరు కుమార్తెలున్నారు..
# ఉద్యోగమివ్వండని నాన్న ప్రాధేయపడ్డాడు



ప్రస్తుతం 'లెనిన్' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే . ఈ సినిమా సక్సెస్ అనంతరం ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. తన చిన్నతనంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. తాను ఒక సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని, ఇండస్ట్రీలో ఈ స్థాయికి చేరుకోవడం అంత సులువుగా జరగలేదని వెల్లడించారు.

తాను పుట్టిన కొద్ది రోజులకే తండ్రి ఉద్యోగం కోల్పోవడంతో తమ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని భాగ్యశ్రీ తెలిపారు. కుటుంబ పోషణ కోసం తన తండ్రి పడిన కష్టాలను గుర్తుచేసుకున్నారు. "మా నాన్న వేరొకరిని బతిమిలాడటం నేను చూశాను. 'దయచేసి నాకు ఏదైనా ఉద్యోగం ఇవ్వండి. నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు' అని ఆయన ఒకరి దగ్గర ప్రాధేయపడటం చూశాను" అని ఆమె చెప్పారు. దీంతో కష్టపడి డబ్బు సంపాదించి తన కుటుంబాన్ని ఆర్థికంగా ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే బలమైన సంకల్పం తనలో ఏర్పడిందని ఆమె వివరించారు. ఇటీవల జరిగిన 'లెనిన్' సక్సెస్ మీట్‌లోనూ భాగ్యశ్రీ భావోద్వేగానికి గురైయ్యారు. ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడినట్లు తెలిపారు. తనను అభిమానులు ఎప్పుడూ ప్రోత్సహించారని కృతజ్ఞతలు తెలిపారు.

మహారాష్ట్రలో జన్మించిన భాగ్యశ్రీ బోర్సే.. 'చందు ఛాంపియన్', 'యారియాన్ 2' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత రవితేజతో 'మిస్టర్ బచ్చన్', విజయ్ దేవరకొండతో కలిసి 'కింగ్‌డమ్', రామ్ పోతినేనితో 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాల్లో నటించారు. దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన 'కాంత' సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెట్టారు. తాజాగా 'లెనిన్'తో సక్సెస్ అందుకున్నారు.

# మార్పునకు నాంది ఈ విజయం!

సమంత ప్రధాన పాత్రధారిగా రూపొందిన 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకుని అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. భారతదేశంలోనే అత్యధిక వసూళ్లని సాధించిన మహిళా ప్రధానమైన చిత్రాల్లో 'మా ఇంటి బంగారం' ఆరో స్థానాన్ని దక్కించుకుందని సినీ వర్గాలు తెలిపాయి. నందినీరెడ్డి దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రధారిగా నటిస్తూనే, తన భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్‌రెడ్డి దువ్వూరుతో కలిసి నిర్మించిన చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైంది.

హాస్యం, యాక్షన్ మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందింది. రూ.100 కోట్ల మైలురాయిని చేరుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు సమంత. "ఈ చిత్రం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారా? మేం చేస్తున్న ప్రచారం వాళ్లకు చేరువవుతోందా? అసలు ఈ సినిమా అంటూ ఒకటి ఉందని వాళ్లకి తెలుసా? అని విడుదలకు ముందు తీవ్రంగా ఆలోచించడం నాకు బాగా గుర్తుంది.

అప్పుడే నా స్నేహితుడు ఒక ప్రదర్శనకారుడికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ సంభాషణని నేనూ వింటున్నానని అతనికి తెలియదు. ఈ సినిమా గురించి మీరేం అనుకుంటున్నారని అడగ్గానే ఏమాత్రం సంకోచించకుండా 'ఒక హీరోయిన్ సినిమాని ఎవరైనా ఎందుకు చూస్తారు? ఆమె ఒక పెద్ద హీరో సినిమాలో నటిస్తే పర్వాలేదు. ఎందుకంటే గ్లామర్ వల్లే ఆమె ప్రేక్షకులకు తెలుసు. కానీ ఒక నాయికా ప్రధానమైన పాత్రలో ఎవరు చూస్తారు?' అన్నారు. ఎవరైనా ఒక సాహసం చేయడానికి సిద్ధపడినప్పుడే నిజమైన మార్పు వస్తుందని అనుకుంటున్నా. చాలాసార్లు ఆ సాహసాలు ఫలించవు. కానీ అప్పుడప్పుడు, అవి ఫలిస్తాయి. మా విషయంలోనూ అది ఫలించింది. ఇది గొప్ప మార్పునకు నాంది అవుతుందని ఆశిస్తున్నా. తదుపరి ఏ ప్రదర్శనకారుడికైనా ఫోన్ చేసి మహిళా ప్రధాన చిత్రం గురించి అడిగితే సమాధానం వెంటనే 'కాదు...' అని రాకూడదని నేను ఆశిస్తున్నా" అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినిమా విజయోత్సాహంలో ఉన్న ఆమె



త్వరలోనే పండంటి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. 'మా ఇంటి బంగారం' సినిమా రూ.100 కోట్ల వసూళ్లు సాధించడంపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.

# సీఎస్కే హెడ్ కోచ్ పదవి ఖాళీ.. రేసులో ఎవరెవరంటే?




ఐపీఎల్‌లో భారీ ఫ్యాన్‌బేస్ కలిగిన టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ . ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆ జట్టుకు ఇప్పుడు ప్రధాన కోచ్ అవసరం వచ్చింది. దాదాపు 18 ఏళ్లపాటు సీఎస్కేతో ప్రధాన కోచ్‌గా కొనసాగిన స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలిగాడు. గత మూడు సీజన్లలో సీఎస్కే కనీసం ఒక్కసారి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకోలేదు. మేనేజ్‌మెంట్, ఫ్లెమింగ్ పరస్పర అంగీకారంతోనే నిర్ణయం తీసుకున్నా.. జట్టు ఘోర ప్రదర్శనకు ప్రధాన కోచ్ కారణమనే ఉద్దేశంతోనే తప్పించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో కొత్త ప్రధాన కోచ్ పదవి రేసులో తెరపైకి ఓ ఐదు పేర్లు వచ్చాయి. అందులో ఎంఎస్ ధోని కూడా ఉండటం గమనార్హం.

సీఎస్కే అంటే ధోని నే అనేంతగా పేరు మారుమోగిపోయింది. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా.. అతడిని చూసేందుకు ప్రేక్షకులు మైదానాలకు భారీగా వచ్చారు. సీఎస్కే బ్రాండ్ విలువ పెరగడం వెనుక ధోనిదే కీలక పాత్ర. ఇప్పుడు స్టీఫెన్ ఫ్లెమింగ్ వెళ్లిపోవడంతో ధోనిపై బాధ్యతలు పెరుగుతాయడనంలో సందేహం లేదు. మరి వచ్చే సీజన్‌లోపే రిటైర్‌మెంట్ ప్రకటించి.. మెంటార్‌గా లేదా ప్రధాన కోచ్ ఏమైనా వస్తాడా? అనేది ఇప్పుడు అభిమానుల్లో నెలకొన్న ప్రశ్న.



టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను సీఎస్కేకు తీసుకొచ్చే ఆలోచనలో మేనేజ్‌మెంట్ ఉన్నట్లు సమాచారం. ధోనితో ద్రవిడ్ కు మంచి సంబంధాలే ఉన్నాయి. సంజు శాంసన్ ఇప్పుడు సీఎస్కేలోనే ఉన్న సంగతి తెలిసిందే. భవిష్యత్తులో అతడే సారథి అయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో ద్రవిడ్‌ను తీసుకుంటే బాగుంటుందేనేది వారి ఆలోచనగా తెలుస్తోంది. రాహుల్ ద్రవిడ్ తర్వాత.. సీఎస్కే మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్‌నూ పరిశీలించే అవకాశం లేకపోలేదు. అయితే, అతడికి నేరుగా ప్రధాన కోచ్ పదవిని ఇస్తారా? అంటే చెప్పలేని పరిస్థితి. ఒకవేళ సీఎస్కే అనుకుంటే అశ్విన్ కు బౌలింగ్ కోచ్‌గా తొలుత బాధ్యతలు అప్పగించొచ్చు. మరోవైపు అశ్విన్ ఇంగ్లాండ్ టెస్టు జట్టుకు ప్రధాన కోచ్‌గా వెళ్తాడనే ప్రచారమూ ఉంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెంటార్ దినేశ్ కార్తిక్ కూడా సీఎస్కేకు కోచ్‌గా రావచ్చని ప్రచారం సాగుతోంది. అయితే, ఆర్సీబీని వదిలి అతడు తన సొంత రాష్ట్రానికి చెందిన సీఎస్కేకు వస్తాడా? లేదా? అనేది కాస్త అనుమానమే. చెన్నై అభిమానులు కూడా వస్తే మంచిదనే కోరుకుంటారు. ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్‌ను వరుసగా రెండుసార్లు గెలవడంలో డీకే పాత్ర కూడా కీలకమైనదే.బ మొన్నటి వరకూ దిల్లీ క్యాపిటల్స్‌కు భారత మాజీ క్రికెటర్ హేమంగ్ బదానీ కోచ్‌గా ఉన్నారు. వరుస సీజన్లలో కనీసం ప్లేఆఫ్స్‌కూ క్వాలిఫై కాకపోవడంతో.. అతడిని ఇటీవలే ఆ ఫ్రాంచైజీ తప్పించింది. అయితే, అతడికి కోచ్‌గా మంచి నైపుణ్యమే ఉంది. మరి సీఎస్కే నుంచి హేమంగ్ బదానీకి రెజ్యూమె పంపించమని సమాచారం వెళ్తుందో లేదో చూడాలి.

# ఇంగ్లాండ్ చిత్తు.. లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన టీమ్‌ఇండియా




భారత మహిళా జట్టు అద్భుతం చేసింది. లార్డ్స్‌లో జరిగిన మొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించి చరిత్ర సృష్టించింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 170 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 341/7 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది.

ముందే డిసైడ్ అయిపోయింది..

దాదాపు మూడో రోజే టీమ్‌ఇండియా విజయం ఖాయమైంది. ఓవర్ నైట్ 130/6 స్కోరుతో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టిన ఇంగ్లాండ్ నాలుగో రోజు తొలి సెషన్‌లోపే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) అదనంగా మరో రెండు పరుగులు మాత్రమే జోడించింది. మ్యాడీ (24) వెంటనే ఔటైంది. అయితే, సోఫీ ఎకెల్‌స్టోన్ (50) కాసేపు పోరాడింది. ఓ వైపు వికెట్లు పడినా.. లోయర్ ఆర్డర్‌లో సోఫీ దూకుడుగా ఆడేసింది. ఓటమి వ్యత్యాసాన్ని మాత్రమే కాస్త తగ్గించగలిగింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలీ 2, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2 వికెట్లు చొప్పున తీశారు.

సచిన్, జైషా సందడి

లార్డ్స్‌లో భారత మహిళా జట్టు తొలిసారి టెస్టు ఆడటంతో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ హాజరయ్యారు. ఆయనతోపాటు ఐసీసీ ఛైర్మన్ జైషా కూడా మ్యాచ్‌ను వీక్షించారు. ఈ మ్యాచ్‌తో ఇంగ్లాండ్ క్రికెటర్లు టామీ బౌమౌంట్, హీథర్ నైట్‌ల అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. ఇప్పటికే వారు కెరీర్‌కు వీడ్కోలు చెప్పిన సంగతి తెలిసిందే.

లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో యస్తికా భాటియా (113) సెంచరీ సాధించింది. స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు సాధించడం గమనార్హం.

టీమ్‌ఇండియా బౌలర్ క్రాంతి గౌడ్ లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచింది. దీంతో సెంచరీ చేసిన యస్తికాతోపాటు క్రాంతి గౌడ్ ఆనర్స్ బోర్డులో పేరు లిఖించుకుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314